J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12





THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 40 సంచిక : 39 26.2.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## కలవరపెడుతున్న...

# కరోనా 2



## మళ్ళీ లాక్‌డౌన్ దిశగా దేశం..?

- ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు
- రాష్ట్రాలు అప్రమత్తం కావాలంటున్న కేంద్రం

**అనుకున్నట్టే జరిగింది. 'కరోనా ఉంది - భయం పోయింది' అని భావించినట్లుగానే, 'నేనున్నాను' అంటూ మళ్ళీ కోవిడ్ భూతం విజృంభిస్తోంది. ఇది మహమ్మారే కాదు మాయదారి కూడా అని నిరూపించుకుంటోంది. ఒకవైపు కరోనా తగ్గుముఖం పడుతోందన్న ఆనందం, మరోవైపు కోవిడ్‌కి టీకా వచ్చేసిందన్న సంతోషంలో ఉన్న భారతీయులను ఇప్పుడు కలవరపెడుతున్న వార్త... కరోనా-2.**

ప్రపంచం మొత్తంలో తక్కువ శాతం కరోనా బారినపడ్డ దేశాల్లో భారత్ ఒకటిగా నిలచిందనుకుంటున్న తరుణంలో, కొత్త కరోనా భారతీయులను ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటికే మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు పాక్షిక లాక్‌డౌన్ విధించాయి. కరోనా-1తో పోలిస్తే ఇది మరింత ప్రమాదకరమని కూడా వైద్య శాస్త్ర నిపుణులు అంచనా వేస్తున్నారు.

గత ఏడాదిలాగే ఈ ఏడాదికూడా ఫిబ్రవరి మొదటివారం నుండి క్రమేణా కరోనా-2 కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. కరోనా తగ్గిపోయిందిలే అన్న ధీమా, టీకా వచ్చేసిందిలే అన్న ధైర్యంతో ప్రజలలో నిర్లక్ష్యం పెరిగిపోయింది. సభలు, సమావేశాలు యధావిధిగా జరుపుకుంటున్నారు. శుభకార్యాలకు మళ్ళీ భారీగా జనాన్ని పిలుచుకుంటున్నారు. అనవసరపు ప్రయాణాలు పెట్టుకుంటున్నారు. ఇక ప్రభుత్వాలైతే ప్రజాసంక్షేమం పేరుతో వేలాదిమందితో భారీ మీటింగులు పెట్టి ఊకదంపుడు మొదలుపెట్టాయి. మరోవైపు ఎన్నికల సంఘం కూడా ఎలక్షన్ల పేరుతో జనాలను రోడ్లపైకి రప్పిస్తున్నారు.

### అప్రమత్తతే శ్రీరామ రక్ష!..

ఈ పరిస్థితుల్లో ప్రజలకు అప్రమత్తతే శ్రీరామ రక్ష. సామాజిక దూరం పాటించని వారికి, మాస్కులు ధరించనివారికి, శానిటైజర్ వాడని వారికీ, అనవసరపు ప్రయాణాలు చేస్తున్నవారికి ఇదొక హెచ్చరిక. జాగ్రత్తలు పాటించి ప్రమాదాన్ని

2 లో



## అసామాన్యుడు, ఆదర్శప్రాయుడు

# గునుపాటి హరిశ్చంద్రారెడ్డి

## ఇక లేరు

2 లో

# జన క్షేమమే ధ్యేయంగా.. జగన్ సంక్షేమ క్యాలెండర్

- దేశంలోనే తొలిసారిగా కోట్లాది రూపాయలతో 'నవరత్నాలు'
- 5 కోట్ల మందికిపైగా ప్రజలకు యువనేత వరాలు



**ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏమాత్రం వెనుకడుగు వేయకుండా ప్రజలందరి అభిమానాన్ని చూరగొంటున్నారు. ప్రజల క్షేమాన్ని కాంక్షిస్తూ ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా, మడమ తిప్పకుండా ప్రజల కష్టాలు తీర్చడానికి 'నేనున్నా'నంటూ కోటాను కోట్ల రూపాయల నిధులను కేటాయిస్తున్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారు. ఈ ఏడాది ఏపి సంక్షేమ కార్యక్రమాలను అమలుచేయాలో నిర్దేశిస్తూ తాజాగా 'సంక్షేమ క్యాలెండర్'ను కూడా విడుదల చేసి తన ప్రత్యేకతను చాటుకున్నారు.**

జన సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వినూత్నమైన రీతిలో 'సంక్షేమ క్యాలెండర్'ను విడుదలచేసి ప్రజల అభ్యున్నతి పట్ల తనకున్న శ్రద్ధను, అభిమానాన్ని చాటుకున్నారు. 'నవరత్నాల' పథకాల అమలుకు సంబంధించి 2021-22 సంవత్సరం చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను ఒక క్యాలెండర్‌గా రూపొందించి ఈనెల23న అమరావతిలో ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పేర్ని నాని ఆ వివరాలు ప్రకటించారు.

### జనం ముంగిళ్ళలోకి జననేత పథకాలు

విద్యార్థులకు, మహిళలకు, పేద బడుగు వర్గాల ప్రజానీకానికి, మత్స్యకారులకు, రైతన్నలకు, నేతన్నలకు ఇలా అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి 'నవరత్నాల' పథకాలు అండగా నిలవనున్నాయి. 'వైఎస్సార్ లా నేస్తం' కింద ప్రతినెలా 2102 మందికి, జగనన్న గోరుముద్ద పథకం ద్వారా 36.88 లక్షల మందికి, సంపూర్ణ పోషణ ద్వారా 30.16 లక్షల మందికి, ఇమామ్, మౌజమ్‌లకు ఆర్థికసాయం కింద 77,290 మందికి లబ్ధి చేకూరుతుంది. వీటితో పాటు ఇంకా మిగిలిపోయిన అర్హులకు ఇళ్లపట్టాల పంపిణీ, నెలవారీ ఇంటింటికీ రేషన్ పథకాలు

2 లో




# కృషీవలుడు.. గునుపాటి హరిశ్చంద్రారెడ్డి

***ప్రముఖ కాంట్రాక్టర్, వ్యాపారవేత్త, జి.హెచ్.రెడ్డిగా ప్రాచుర్యం పొందిన.... గునుపాటి హరిశ్చంద్రారెడ్డి ఫిబ్రవరి 23వ తేది, మంగళవారం తెల్లవారుఝామున భీష్మ ఏకాదశి రోజున కాలధర్మం చెందారు. హైదరాబాదులోని తమ స్వగృహంలో తన 89వ ఏట ఆయన తుదిశ్వాస విడిచారు. హరిశ్చంద్రారెడ్డిది ఆదర్శవంతమైన జీవితం. ఎదిగే కొద్దీ ఒదగాలన్న గుణానికి ఆయన నిలువెత్తు నిదర్శనం.***



నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామంలో పేరుమోసిన ఆదర్శ రైతు కుటుంబంలో గునుపాటి వెంకటరమణారెడ్డి – శేషమ్మ దంపతుల 5వ సంతానంగా 1933, ఫిబ్రవరి 16వ తేదీన హరిశ్చంద్రారెడ్డి జన్మించారు. మొన్న ఫిబ్రవరి 16కి ఆయన 88 సంవత్సరాలు పూర్తిచేసుకుని 89లో అడుగుపెట్టారు. స్వగ్రామం కొత్తూరుతో పాటు కొంతకాలం వెంకటగిరిలో కూడా ఆయన బాల్య విద్యాభ్యాసం గడిచింది. మద్రాసు లయోలా కాలేజీలో ఇంటర్ (అప్పట్లో పియుసి) పూర్తి చేసి మద్రాసులోనే గిండి ఇంజనీరింగ్ కాలేజీలో బ్యాచిలర్ అఫ్ ఇంజనీరింగ్, మెకానికల్ విభాగంలో పట్టా పుచ్చుకున్నారు. పిడబ్ల్యూడిలో జూనియర్ ఇంజనీరుగా ప్రభుత్వ ఉద్యోగం పొందారు. ఆ రోజుల్లో గూడూరు ప్రాంతంలో దొడ్ల సుబ్బారెడ్డి కాంట్రాక్టర్‌గా నిర్మించబడిన వంతెన పని హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలోనే జరిగింది. నిక్కచ్చయిన ముక్కుసూటి అధికారిగా అప్పట్లోనే ఆయనకు పేరుండేది. ఆ సమయంలో తన సమీప బంధువు తనకు అత్యంత ఆప్తుడు పులగం దశరథరామిరెడ్డి(బుజ్జిరెడ్డి) దొడ్ల సుబ్బారెడ్డి దగ్గర వర్క్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేసేవారు.







గూడూరులో ఉన్న సమయంలోనే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే 'నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్'లో హరిశ్చంద్రారెడ్డికి ఇంజనీరుగా ఉద్యోగం వచ్చింది. 3 సంవత్సరాల పాటు అక్కడ విధులు నిర్వహించిన తరువాత ఆయన ఇక ఉద్యోగం చేయదలుచుకోలేదు, తన స్వంత ప్రతిభతో ఎదగాలని నిర్ణయించుకున్నారు. అప్పటికే జిల్లాలో ప్రసిద్ధి పొందిన తన మేనమామ ఆల్తూరు రామిరెడ్డి, దొడ్ల సుబ్బారెడ్డిలను ఆయన మార్గదర్శకంగా తీసుకున్నారు. తానుకూడా వాళ్లంత పెద్ద కాంట్రాక్టర్‌గా ఎదగాలన్న లక్ష్యాన్ని నిర్ధేశించుకున్నారు.

ఇదే సమయంలో విశాఖపట్టణంలో నెల్లూరుకు చెందిన మరో దొడ్ల కుటుంబం ఆధ్వర్యంలో జరుగుతుండిన సీలేరు ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆ సంస్థ నిర్వాహకులు హరిశ్చంద్రారెడ్డిని సాంకేతిక సలహాదారుగా నియమించుకుని తమ సంస్థలో భాగస్వామ్యం ఇచ్చి ఆయనను సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ చేశారు. కాంట్రాక్టర్‌గా ఆయనకి బీజం పడింది ఇక్కడే. ఆ తరువాతి కాలంలో పులగం దశరథరామిరెడ్డిని తన జతగా చేసుకుని కాంట్రాక్టర్‌గా తన ప్రస్థానం మొదలుపెట్టిన తొలినాళ్లలో కర్ణాటకలోని గుల్బర్గాలో ఎస్కవేషన్ పనితోపాటు, నారాయణపూర్ వద్ద కృష్ణానది అప్పర్ కెనాల్ ప్రాజెక్టు పనిని సమర్ధవంతంగా పూర్తిచేశారు. సత్తావున్న కాంట్రాక్టర్లుగా పేరు గడించి అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. అదే సమయంలో 1969 –72 సంవత్సరాల మధ్య తిరుమల రెండవ ఘాట్ రోడ్డు పనిని కూడా దశరథరామిరెడ్డితో కలిసి నిర్మించాడు. తిరుమల రోడ్డు పని పూర్తికావచ్చిన దశలోనే, కర్ణాటకలోని బెల్గాం జిల్లాలో ఘటప్రభ నదిపై భారీ స్థాయిలో నిర్మితమవుతున్న హిడికల్ డ్యామ్ నిర్మాణంపైన హరిశ్చంద్రారెడ్డి దృష్టిపడింది. దశరథరామిరెడ్డి, జిహెచ్ రెడ్డి కలసి, హిడికల్ డ్యామ్ నిర్మాణ కాంట్రాక్టు పనిని సాధించుకున్నారు. వీరిద్దరి భాగస్వామ్యంలో ఆ డ్యామ్ నిర్మాణం జరిగింది. అప్పటికే నెల్లూరుకు చెందిన హరిశ్చంద్రారెడ్డి మేనమామ ఆల్తూరు రామిరెడ్డి, గునుపాటి రామచంద్రారెడ్డిలు కూడా హిడికల్ డ్యామ్ కాంట్రాక్టర్లలో ఉన్నారు. ఇక్కడి నుండి హరిశ్చంద్రారెడ్డి వెనుదిరిగి చూడలేదు. 1974లో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో కలసి కడపజిల్లా రైల్వే కోడూరులో డిటర్జెంట్ ఇండియా లిమిటెడ్ పేరుతో పరిశ్రమను నెలకొల్పి పారిశ్రామికవేత్తగా ఎదిగారు. అప్పట్లో డిటర్జెంట్ ఇండియా తయారుచేసే రీగల్ బట్టల సబ్బంటే ప్రసిద్ధి. 1974 నుండి 1981 వరకు ఆ సంస్థను విజయపథంలో నడిపారు.



1981లో వంశీకృష్ణామూవీస్ బ్యానర్ పైన బాపు – రమణల పర్యవేక్షణలో 'వంశవృక్షం' సినిమాను నిర్మించారు హరిశ్చంద్రారెడ్డి. హిందీ సినీ రంగంలో ఈరోజుకీ స్టార్‌లా మెరుస్తున్న సుప్రసిద్ధ నటుడు అనిల్‌కపూర్ సినిమా పరిశ్రమకు పరిచయమయ్యింది ఆ సినిమాతోనే. ఈ సుదీర్ఘ ప్రస్థానంలో చెన్నైలోను, నెల్లూరులోనూ నివాసం ఉంటూ తరువాతి రోజుల్లో తన మకాంను పూర్తిగా హైదరాబాదుకు మార్చుకున్నారు. మధ్యలో తన దృష్టి ఫార్మా రంగంవైపు మరలినప్పటికీ ఆ రంగంపై పెద్దగా ఆసక్తి కనపరచకుండా, ఆతిథ్య రంగంవైపు ఆకర్షితుడయ్యారు. దయానా హోటల్స్ లిమిటెడ్‌ను స్థాపించి హోటళ్ల నిర్మాణం మొదలుపెట్టాడు.

హైదరాబాదులో 1989లో గ్రీన్‌పార్క్ హోటల్ నిర్మాణాన్ని మొదలుపెట్టి 1991లో ఆ హోటల్‌ని ప్రారంభించారు. 3 దశాబ్దాలు పూర్తిచేసుకున్నా ఇప్పటికీ గ్రీన్‌పార్క్ హోటల్ ఖ్యాతి ఎక్కడా తగ్గలేదు. 1984లో హైదరాబాదులోని బంజారా హిల్స్ రోడ్డునంబర్–1లోని ఆయన నివాస గృహానికి 'గ్రీన్‌పార్క్' అనే పేరుండేది. అదే పేరును తమ హోటల్స్‌కి కూడా పెట్టారు. 1995లో విశాఖపట్టణంలోని అప్సర హోటల్‌ని కొని దానిని కూడా గ్రీన్‌పార్క్‌గా మార్చేశారు. చెన్నై వడపళనిలోని విజయా వారి సంస్థానానికి చెందిన విజయరాణి మహల్, విజయ శేషమహల్, చందమామ బిల్డింగ్స్‌ని కొనుగోలుచేసి అక్కడ అతి భారీ సముదాయంలో ఫోరమ్ షాపింగ్‌మాల్‌ని నిర్మించడమే కాకుండా అక్కడే అధునాతనమైన హంగులతో మరో గ్రీన్‌పార్క్ హోటల్‌ని కూడా ఆయన నిర్మించారు.

## నాన్న పేరుతో కాలేజి ...

తమ తండ్రి గునుపాటి వెంకటరమణారెడ్డి పేరు మీద నెల్లూరులో జూనియర్ కాలేజీని ప్రారంభించారు. జివిఆర్ఆర్ కాలేజిగా ఆ విద్యాసంస్థ ప్రసిద్ధి. హరిశ్చంద్రారెడ్డి ఆర్ఎస్ఎస్ అభిమాని, ఆ సిద్ధాంతాల పట్ల ఎక్కువ ఆకర్షితుడయ్యేవాడు. అదే సిద్ధాంతాలతో తమ తండ్రి పేర కళాశాలను స్థాపించారు. కాలేజీ హాస్టల్ నిర్మాణం కోసం కూడా భూరి విరాళాన్ని అందించారు. జిల్లాలో ఉన్న ఎయిడెడ్ కళాశాలలలో జివిఆర్ఆర్ ఒకటి.

## అనితర సాధ్యమైన ప్రస్థానం...

ఒక చిన్న పల్లెటూరులో జన్మించి, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌గా తన ప్రయాణాన్ని మొదలుపెట్టి కాంట్రాక్టర్‌గా, పారిశ్రామికవేత్తగా, సినీ నిర్మాతగా, ఆతిధ్యరంగంలో తిరుగులేని వ్యాపారవేత్తగా హరిశ్చంద్రారెడ్డిది అనితరసాధ్యమైన ప్రస్థానం. ఆయన ఏ పని చేపట్టినా చిత్తశుద్ధితో, అంకితభావంతో చేసేవారు. నాణ్యతా ప్రమాణాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. సమయపాలన పాటించేవారు. ఏ విషయంలోనూ రాజీపడేవాడు కాదు. నైతిక విలువలు కోల్పోకూడదని, నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని తన చుట్టూ ఉన్న వారికి హితబోధ చేసేవారు. తాను ఎంతటి ఉన్నత శిఖరాలు అధిరోహించినా ఆయనలో కొంచెం కూడా గర్వం కనిపించేది కాదు. నిరాడంబరంగా ఉండేవాడు.. వేల కోట్ల సామ్రాజ్యాన్ని ఆయన ఒంటి చేత్తో నడిపిస్తున్నాడంటే నమ్మశక్యం అయ్యేది కాదు.

## తన వాళ్ళందరిని పైకి తీసుకొచ్చారు

తన మేనమామ ఆల్తూరు రామిరెడ్డి తనకు స్ఫూర్తి అయితే, హరిశ్చంద్రారెడ్డి తన మేనల్లుళ్ళకు తాను స్ఫూర్తిప్రదాతగా నిలిచారు. స్వయానా తన పెద్దక్క పిల్లలైన జెకె రెడ్డి, జె.యస్ రెడ్డిలతో పాటు చిన్నక్క పిల్లలు (బావమరుదులు కూడా) ఆదాల రాఘవరెడ్డి, ఆదాల ప్రభాకరరెడ్డి, ఆదాల మురళీకృష్ణారెడ్డిల విజయాలకు హరిశ్చంద్రారెడ్డి రాచబాటలు వేశారు. తన తోడల్లుడు దయాకరరెడ్డి, వారి పిల్లలను కూడా హరిశ్చంద్రారెడ్డే తీర్చిదిద్దారు. ఒకరకంగా వారందరికీ ఆయన గురువులాంటి వాడు.

## తుంగా కుటుంబంతో ఆత్మీయ బంధం

'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు, కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి కుటుంబంతో హరిశ్చంద్రారెడ్డికి బంధుత్వంతో పాటు ఆత్మీయ బంధం కూడా ఉంది. రాజగోపాలరెడ్డి అంటే ఆయనకు చాలా ఇష్టం. నెల్లూరులో అన్యాక్రాంతం కాబోతున్న ఒక చరిత్రాత్మక సంస్థని, సంస్థ ఆస్తులని కాపాడాలన్న లక్ష్యంతో 1981లో 'లాయర్' పత్రిక ప్రారంభిచడానికి స్ఫూర్తిని ఇచ్చింది హరిశ్చంద్రారెడ్డి ఆయన మేనల్లుళ్ళ ఆదాల రాఘవరెడ్డి, జె.కె.రెడ్డిలే. అక్రమార్కులపై న్యాయపోరాటం చేయడానికి, ప్రజల పక్షాన వాదించడానికి 'లాయర్' పత్రికను అప్పట్లో వారు వేదిక చేశారు.

హరిశ్చంద్రారెడ్డికి అక్కలు కామేశ్వరమ్మ, సుశీలమ్మ... భార్య శ్యామలమ్మ, కుమారుడు ప్రసాద్‌రెడ్డి, కుమార్తె పార్వతి ఉన్నారు. ఆయన అన్న కీర్తిశేషులు గునుపాటి ఆదిశేషారెడ్డి కూడా పేరుమోసిన న్యాయవాదిగా నెల్లూరీయులకు సుపరిచితులు. ఆయన పెద్దన్న రామచంద్రారెడ్డి చాన్నాళ్ల క్రితం కాలం చేశారు.

మనుమలు మనుమరాళ్ళు, మునిమనుమలు, మునిమనమరాళ్ళతో పరిపూర్ణ జీవితం గడిపి, గత కొంత కాలంగా స్వల్ప అనారోగ్యంతో ఉంటూ, మంగళవారం ఉదయం ఆయన కన్నుమూశారు. ఎంతోమంది జీవితాలలో వెలుగులు నింపిన ఆ దీపం ఫిబ్రవరి 23న శివైక్యమయ్యింది. హరిశ్చంద్రారెడ్డి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ... వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## సోమిరెడ్డి సంతాపం

హరిశ్చంద్రారెడ్డి మృతి పట్ల మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన నిర్మాణ, ఆతిథ్య రంగాలలో తన ప్రతిభా ప్రావీణ్యాలతో సామాన్య స్థాయి నుండి అసామాన్య స్థాయికి ఎదిగాడని సోమిరెడ్డి అన్నారు. నెల్లూరుజిల్లా కొత్తూరు గ్రామంలో పుట్టిన ఆయన జిల్లాకు వన్నెతెచ్చారని కొనియాడారు.

## సంక్షేమ క్యాలెండర్

(మొదటి పేజీ తరువాయి)

ఎటూ ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 5,08,08,220 మంది ప్రజలకు జగనన్న పథకాలు చేరువవుతున్నాయి.

### 'సంక్షేమ క్యాలెండర్' ఇదీ...

ఈ ఏడాది ఏప్రిల్‌లో 'జగనన్న వసతి దీవెన' కార్యక్రమం అమలవుతుంది. దీని వల్ల 15,56,956 మందికి లబ్ధి చేకూరుతుంది. అదేవిధగా ఈ ఏడాది ఏప్రిల్, జూలై, డిసెంబరు నెలల్లోను, వచ్చే ఏడాది ఫిబ్రవరిలోను 'జగనన్న విద్యా దీవెన' (పూర్తిస్థాయిలో రీయింబర్స్‌మెంట్) పథకం అమలవుతుంది. ఈ పథకం కింద 18,80,934 మంది లబ్ధి పొందుతారు. జూన్‌లో 42,34,322 మందికి 'జగనన్న విద్యా కానుక' అందనుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు వడ్డీలేని రుణాలు 90,37,255 మందికి, రైతులకు 2019 రబీ, 2020 ఖరీఫ్ సీజన్‌ల కింద వడ్డీ లేని రుణాలు సుమారు 66,11,382 మందికి అందనున్నాయి. మే నెలలో 2020 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల బీమా చెల్లింపు, మే, అక్టోబర్ నెలల్లోను, 2022 జనవరిలో మూడుసార్లుగా 54 లక్షలా 300 మందికి 'రైతుభరోసా' పథకం కింద ఆర్థికసాయం అందనుంది. మే నెలలో 1,09,231 మత్స్యకార కుటుంబాలకు మత్స్యకార భరోసా కింద లబ్ధి చేకూరుతుంది. అదే నెలలో ఈ పథకం కింద 19.746 మందికి డీజల్ సబ్సిడీ చెల్లింపు జరుగుతుంది. జూన్‌లో 'వైఎస్సార్ చేయూత' కింద 24,55,534 మందికి ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. జూలైలో 'వైస్సార్ వాహన మిత్ర' పథకం కింద సుమారు 2,74,015 మందికి, అదే నెలలో 'కాపు నేస్తం' పథకం కింద 3,27,862 మందికి సాయం అందనుంది. ఆగస్టులో 25 లక్షల మంది రైతులకు 2021 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వడ్డీ లేని రుణాలు, ఎంఎస్ఎంఇ, స్పిన్నింగ్ మిల్లులకు ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్‌లను 9,800 పరిశ్రమలకు చెల్లిస్తారు. 'నేతన్న నేస్తం' కింద 81,703 మందికి ఆర్థికసాయం, అగ్రిగోల్డ్ బాధితులైన 3,34,160 మందికి నగదు పరిహారం, సెప్టెంబర్‌లో 'వైఎస్సార్ ఆసరా' కింద 87,74,674 మందికి, అక్టోబర్‌లో 'జగనన్న తోడు' పథకం కింద 9 లక్షలా 5వేల మందికి సాయం అందుతుంది. ఇంకా టైలర్లు, రజకులు, నాయీబ్రాహ్మణులు మొత్తం 2 లక్షలా 98 వేల మందికి 'జగనన్న తోడు' ఆర్థికసాయం అందుతాయి. ఆర్థికంగా వెనుకబడిన కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ ఇతర అగ్రవర్ణాల మహిళలకు సాయంగా కొత్తగా ప్రవేశ పెట్టిన 'ఇబిసి నేస్తం' పథకం కింద 6 లక్షల మందికి పైగానే నవంబర్‌లో ఆర్థిక సాయం అందుతుంది. 2022 జనవరిలో 'అమ్మఒడి' పథకం కింద 44,48,685 మందికి ఆర్థికసాయం అందుతుంది.

## కరోనా-2

(మొదటి పేజీ తరువాయి)

నివారించకపోతే ప్రాణాలకే ప్రమాదం. టీకా ఇంకా పూర్తిగా అందుబాటులోకి రాలేదు. చాలామందికి రెండవ డోసు వెయ్యలేదు. రెండు డోసులు వేసినా ఆ తరువాత కూడా నెలరోజుల వరకు కరోనా రాదని గ్యారంటీ లేదు. ఇప్పటికే గత లాక్‌డౌన్ వల్ల వందల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. లక్షలాదిమంది జీవితాలు అతలాకుతలమయ్యాయి. ఇకనైనా మేలుకుందాం, మనల్ని మనమే రక్షించుకుందాం..!

• రియల్ బూమ్




# నెల్లూరులో భూముల ధరలకు రెక్కలు

***గత పన్నెండు సంవత్సరాలుగా నీరసించిపోయివుండిన నెల్లూరు రియల్ ఎస్టేట్ రంగం ఒక్కసారిగా కళకళలాడుతోంది. ముఖ్యంగా నెల్లూరు నగరంలో ప్రధాన ప్రాంతాలలో భూముల రేట్లు 30 శాతం నుండి 50 శాతం వరకు పెరిగిపోయాయి. అమ్మకాలు, కొనుగోళ్లతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కళకళలాడుతున్నాయి.***

## 2004 తరువాత...

గతంలో 1994 నుండి 2004 వరకు జిల్లాలో రియల్ ఎస్టేట్ పరిస్థితి ఘోరంగా ఉండేది. 2004లో అటు దేశంలోనూ, ఇటు ఉమ్మడి రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత, ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ చేపట్టిన అనేక ఆర్థిక సంస్కరణల కారణం కావచ్చు, లేదా భారతదేశంలోకి తన్నుకొచ్చిన విదేశీ పెట్టుబడుల కారణం కావచ్చు దేశమంతా ఒక్కసారిగా భూముల ధరలకి రెక్కలొచ్చాయి. మిగతా రాష్ట్రాల సంగతి పక్కనపెడితే రెండు తెలుగు రాష్ట్రాలలో 2009 వరకూ అదే బూమ్ కొనసాగింది. 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణంతో వచ్చిన రాజకీయ సంక్షోభంతో రెండు తెలుగు రాష్ట్రాలలో ఒక్కసారిగా లావాదేవీలు కుప్పకూలాయి. అదే క్రమంలో నెల్లూరులో కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారం స్తబ్ధుగా ఉండిపోయింది.

## 2014 నుండి...

2014లో తెలంగాణ ఏర్పడడంతో అక్కడ చంద్రశేఖరరావు నాయకత్వంలోని ప్రాంతీయపార్టీ అధికారంలోకి వచ్చింది. అప్పటికే అభివృద్ధి చెందివున్న తెలంగాణ రాష్ట్రాన్ని పురోగమనంవైపు నడిపించడం టిఆర్‌యస్ పార్టీకి చాలా సులువైంది, పెట్టుబడులు వరదలా వచ్చి పడడంతో క్రమంగా 2017 నుండి తెలంగాణ మొత్తం భూముల రేట్లు పెరుగుతూ వచ్చాయి. పేరుకి తెలంగాణ రాష్ట్రం కొత్తగా ఏర్పడిందే తప్ప వాస్తవానికి కొత్తగా ఏర్పడింది ఆంధ్ర అనే చెప్పకతప్పదు. ఆంధ్రాలో హైదరాబాదు తరహా శాసనసభ లేదు, సచివాలయం లేదు, అత్యున్నత న్యాయస్థానం లేదు, అంతర్జాతీయ విమానాశ్రయం లేదు.

అమరావతిని రాజధానిగా ప్రకటించి, చంద్రబాబు చేసిన టక్కు టమారా జిమ్మిక్కుల వల్ల విజయవాడ గుంటూరు పరిసరాల్లో భూమి రేట్లు పెరిగాయి తప్ప రాష్ట్రంలో మిగతా చోట్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం పడుకుంది.

## ఆంధ్రాలో జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక...

జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత, రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం పడేవిధంగా ఆశించిన మేరకు నిర్ణయాలు తీసుకోకపోవడంతో రియల్టర్లు నీరసించిపోయారు. పైగా 3 రాజధానుల ప్రతిపాదన తెరపైకి తేవడంతో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సైతం లావాదేవీలు ఒక్కసారిగా స్తంభించిపోయాయి. పెట్టుబడిదారులంతా కొత్తదారులు వెతుక్కోవడం ప్రారంభించడంతో, ఆ ప్రభావం తెలంగాణపై... ముఖ్యంగా హైదరాబాదుపై ఎక్కువగా పడి హైదరాబాదు పరిసరాల్లో ఉన్నట్టుండి భూముల ధరలు 100 నుండి 300 శాతం వరకు పెరిగిపోయాయి, ఇంకా పెరుగుతూనే ఉన్నాయి.

## ఆంధ్రాలో ఆ మూడు ప్రాంతాలలో ...

ప్రభుత్వం తీసుకున్న పాతిక జిల్లాలు, 3 రాజధానుల నిర్ణయం వల్ల, ఇప్పుడు నెల్లూరు, తిరుపతి నగరాలతోపాటు విశాఖ పరిసరాల్లో భూములకు ధరలు వచ్చాయని ఇన్వెస్టర్ల అభిప్రాయం. చెన్నై మహానగరానికి దగ్గరగా ఉండడం, నెల్లూరు, చెన్నై బెంగుళూరు నగరాలను అనుసంధానం చేస్తూ రానున్న ఇండస్ట్రియల్ కారిడార్ వంటి ప్రాజెక్టులు ఇప్పుడు ఈ పెరుగుదలకు కారణమని విశ్లేషిస్తున్నారు. తిరుపతిలో ఐటి హబ్, నెల్లూరులో కొత్తగా పారిశ్రామిక వాడల నిర్మాణాలు... వంటి వార్తలు పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయన్నది వారి భావన.

## నెల్లూరు నగరంలో...

గత 3 నెలలుగా ఉన్నట్టుండి నెల్లూరు నగరంలో రియల్ బూమ్ వచ్చింది. 30 నుండి 50శాతం వరకు రేట్లు పెరిగాయి లావాదేవీలుకూడా బాగా జరుగు తున్నాయి. నగరంలో, నగర శివార్లలో కొత్తగా అభివృద్ధి చెందుతున్న నివాస కాలనీలకు ఇప్పుడు బాగా డిమాండ్ కనిపిస్తోంది. కరోనా అనుభవాల తరువాత అపార్టుమెంట్ల కంటే ఇండిపెండెంట్ ఇల్లే శ్రేయస్కరమనే ఆలోచన కూడా రావడంతో అటువైపే కొనుగోలుదారులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఇక పాత నగరంగా పేరు పడిపోయిన ట్రంకురోడ్డు, చిన్న బజార్, కాపు వీధి తదితర ప్రాంతాలలో రద్దీ బాగా పెరిగిపోయి ట్రాఫిక్ సమస్యలు ఎక్కువ అవుతుండడంతో వ్యాపార లావాదేవీలకు కూడా మినీ బైపాస్(రాజీవ్ రహదారి) వంటి ప్రధాన రోడ్లతో పాటు... మాగుంట లే అవుట్, ఇస్కాన్ టెంపుల్ రోడ్డు వంటి ప్రాంతాలపై కూడా వ్యాపారస్తులు మొగ్గు చూపిస్తున్నారు. మొత్తానికి చాన్నాళ్లకు నెల్లూరులో మళ్లీ రియల్ సందడి మొదలయ్యింది, అక్కడ అంత... ఇక్కడ ఇంత అంటూ, మీడియేటర్లు పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నారు. కొనుగోలుదారులు పెరగడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కూడా చాలారోజుల తరువాత సందడి కనిపిస్తోందని డాక్యుమెంట్ రైటర్లు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

• రాజకీయ నిరుద్యోగులకు శుభవార్త

# వరుసగా ఉద్యోగావకాశాలు





**మార్చి, మే, జూన్, జూలైలలో ఖాళీ కానున్న మండలి సీట్లు**

**నెల్లూరుజిల్లా నుండి బల్లి కళ్యాణ్, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డిలతో పాటు కొడవలూరు ధనుంజయరెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి కూడా క్యూలో ఉన్నారు.**

***వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి అభిమానులు, కార్యకర్తలతో పాటు నాయకుల సంఖ్య కూడా ఎక్కువే. పార్టీలో ఉన్న నాయకులందరినీ సంతృప్తిపరచడం యువ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి పెద్ద సవాలే. అందుకే కాబోలు ఆయన ఎవరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా చిక్కడుదొరకడు అనిపించుకుంటున్నాడు.***





మార్చి నుండి జులైలోగా శాసనమండలిలో చాలా సీట్లు ఖాళీ కాబోతున్నాయి. తొలి విడతగా మార్చిలో, అంటే వచ్చే నెలలో 6 సీట్లు ఖాళీ అవుతున్నాయి. వీటిల్లో ఇప్పటికే ముగ్గురు పేర్లు ఖరారైపోయాయని విశ్వసనీయ సమాచారం. వైయస్సార్‌సీపీ శాసనమండలి సభ్యుడిగా ఉన్న షేక్ మహమ్మద్ ఇక్బాల్ పదవీ కాలం మార్చితో ముగుస్తుంది. ఆయనకు మళ్లీ మండలి సభ్యత్వం లభిస్తుందంటున్నారు. ఇటీవలే మరణించిన చల్లా రామకృష్ణా రెడ్డి స్థానాన్ని ఆయన కుమారుడు భగీరథరెడ్డితో భర్తీ చేస్తారని ఖచ్చితమైన సమాచారం. విడదల రజనీ కోసం తన సీటును త్యాగం చేసిన మర్రి రాజశేఖర్‌కి ముఖ్యమంత్రి అభయం లభించి నట్లు కూడా వార్త. మార్చిలో ఖాళీ అయ్యే 6 సీట్లలో 3 పేర్లు దాదాపుగా తెరమీదకు వచ్చినట్లే. మిగిలిన 3 స్థానాలు ఎవరిని వరించబోతున్నాయో అన్నది ఇప్పుడు వైసిపిలో హాట్ టాపిక్.

## ఆ ఒక్కరు ఎవరు...?

మార్చిలో భర్తీ చేసే ఖాళీలలో నెల్లూరుజిల్లా నుండి ఒకరికి అవకాశం లభించనున్నట్లు తెలుస్తోంది. ఆ ఒక్కరు ఎవరు..? అన్నది ఇప్పుడు సర్వత్రా నెలకొన్న ఉత్కంఠ. ప్రధానంగా ఆరుగురు తెరపై కనిపిస్తున్నప్పటికీ తెరవెనుక ఇంకా చాలామంది తమ శక్తి మేరకు ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు కూడా తెలుస్తోంది!

## బల్లి కళ్యాణ్

కోవిడ్ పొట్టన పెట్టుకున్న తిరుపతి పార్లమెంటు సభ్యుడు బల్లి దుర్గాప్రసాద్ స్థానంలో పార్లమెంటు ఉప ఎన్నికల అభ్యర్థిగా డాక్టర్ గురుమూర్తిని బరిలో దింపుతామని, అందుకు బదులుగా బల్లి కుమారుడు కళ్యాణ్‌కి యంయల్‌సి ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని పార్టీ వర్గాలే బహిరంగంగా ప్రకటించాయి. మరి ఆ హామీని ఇప్పుడు అమలు చేస్తారా..? లేక పార్లమెంటు ఉపఎన్నిక ముగిసిన తరువాత చేస్తారా...?? అన్నది ఇక్కడ ప్రశ్నార్థకం. ఉప ఎన్నిక నాటికి ఇస్తేనే బాగుంటుందని కొందరి అభిప్రాయం అయితే, ఉప ఎన్నికలలో వాళ్ళు పనిచేసే తీరును చూసి నిర్ణయం తీసుకోవచ్చుగా అన్నది కూడా మరి కొంతమంది పార్టీ శ్రేణుల అభిప్రాయంగా తెలుస్తోంది. అసలు మా నాయకుడి కుమారుడికి శాసనమండలి పదవికన్నా క్యాబినెట్ హోదాతో ఏదైనా కార్పొరేషన్ ఛైర్మెన్ పదవి ఇవ్వడమే సముచితంగా ఉంటుందని బల్లి అభిమా నుల కోరికని కూడా చెప్తున్నారు.

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నేదురుమల్లి జనార్ధనరెడ్డి కుమారుడు రాంకుమార్‌రెడ్డి పేరు కూడా బలంగా వినిపిస్తోంది. ఆయన 2018 సెప్టెంబర్‌లో పార్టీలో చేరేరోజునే 2019 ఎన్నికలలో టిక్కెట్టు ఆశించకూడదన్న షరతును పార్టీ పెద్దలు విధించారు. ఆ షరతుకు కట్టుబడి ఆయన పార్టీలో చేరినప్పటి నుండీ పార్టీ పటిష్టత కోసం పనిచేస్తున్నాడు... పలు సందర్భాలలో పార్టీ అధిష్టానం ఆయనకు కీలక బాధ్యతలను కూడా అప్పజెప్పింది. 2019 ఎన్నికలలో తిరుపతి, బాపట్ల పార్లమెంటు నియోజక వర్గాల పరిశీలకుడిగా అభ్యర్థులను ఎంపిక చేసే విషయంలోనూ ఆయన సూచనలు సలహాలు తీసుకున్నారు. ఎన్నికల వేళ ఒంగోలు, బాపట్ల పార్లమెంటు నియోజకవర్గాల ఇన్‌ఛార్జిగా తనకిచ్చిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి పార్టీ విజయానికి అప్పట్లో ఆయన రాత్రి పగలు శ్రమించాడు. పార్టీ అధికారంలోకి వచ్చి ప్రభుత్వం ఏర్పడిన ఈ 21నెలల కాలంలో, విద్యారంగానికి సంబంధించిన అనేక కీలక సమస్యలను పరిష్కరించడంలో రాంకుమార్‌రెడ్డి ప్రభుత్వానికీ, విద్యారంగ సంస్థల యాజమాన్యా లకు మధ్య వారధిగా పనిచేసి, విద్యారంగంలో అనేక సంస్కర ణలు తీసుకురావడంలో ప్రభుత్వానికి సహకరించారు. తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికల సందర్భంగా కూడా ఒంగోలు, బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఆయనకిచ్చిన బాధ్యతలను ఒకవైపు చూస్తూనే, మరోవైపు సొంత జిల్లాలో తన పరపతి, పలుకుబడి ఉన్న గూడూరు, వెంకటగిరి నియోజక వర్గాలలో అత్యధిక పంచాయతీలను ఏకగ్రీవం చేయడంలోనూ, గెలిపించడంలోనూ కీలక పాత్ర పోషించారు రాంకుమార్. అజాత శత్రువుగా అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడిగా ఆయన జిల్లా రాజకీయాలలో గుర్తింపు సాధించాడు. ఒక మాజీ ముఖ్యమంత్రి కుమారుడిగా నిత్యం పార్టీ కోసం పనిచేస్తున్న తమ నాయకుడికి ప్రభుత్వంలో ఎలాంటి కీలక పదవి లభించకపోవడం పట్ల నేదురుమల్లి అభిమానులు ఆవేదన చెందుతున్నారు. పార్టీ ఏ బాధ్యతను అప్పజెప్పినా అంకితభావంతో పనిచేస్తున్న తమ నాయకుడికి పార్టీ ఈసారైనా అవకాశం కల్పించాలన్నది నేదురుమల్లి అనుచరుల కోరిక.

## మెట్టుకూరు ధనుంజయరెడ్డి

ముఖ్యమంత్రి జగన్‌కి, ఆయన బాబాయ్, టిటిడి ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డికి అత్యంత ఆప్తుడు, జిల్లా రాజకీయాలలో కీలక భూమిక పోషిస్తున్న మరో నాయకుడు మెట్టుకూరు ధనుంజయ రెడ్డి కూడా ఆశావహులలో ఉన్నారు. 2019 ఎన్నికలలో ధనుంజయరెడ్డి కూడా పార్టీ విజయం కోసం కృషిచేశారు. పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రిని కలవడానికే ఆయనకు 18 నెలలు పట్టింది. ఎన్నికల తరుణంలో ధనుంజయ రెడ్డిని అన్ని విధాలా వాడుకుని ఆ తరువాత పార్టీ ఆయనను పట్టించుకోలేదన్న ఆవేదన ఆయన వర్గీయులలో ఉంది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల తరుణంలో సైతం ఆయన కన్నతల్లి పైనే సొంత పార్టీ వర్గీయులు పోటీచేసినా, అధిష్టానం పట్టించు కోకపోవడంపట్ల కూడా ఆయన అభిమానులు మనస్తాపం చెందుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టి ఆ తరువాతి కాలంలో నవ్యాంధ్రలో తెలుగుదేశం హయాంలోనూ, వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డ తొలినాళ్ళలోనూ మొత్తం కలిపి ఆరున్నర సంవత్సరాల పాటు మూడు పార్టీల ప్రభుత్వా లలో, ముగ్గురు ముఖ్యమంత్రుల హయాంలలో సెంట్రల్ బ్యాంకు అధ్యక్షుడిగా పనిచేసిన వ్యక్తి ధనుంజయరెడ్డి. ఆయన కూడా తనకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని పార్టీ సలహాదారులను కోరుతున్నట్లు భోగట్టా.

## ఆనం విజయకుమార్‌రెడ్డి

ఆనం విజయకుమార్‌రెడ్డి కూడా మండలి రేసులో ఉన్నారు. ఆయన ఇప్పటికే సెంట్రల్ బ్యాంకు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు, ఆయన సతీమణిని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పదవికి అభ్యర్థిగా కూడా పార్టీ ప్రకటించింది, ఇలాంటి తరు ణంలో ఆనం విజయ పేరు పరిశీలనకు తీసుకోవడం ఈ దఫా సాధ్యం కాదన్నది పార్టీలో వినిపిస్తున్న మాట.

## కొడవలూరు ధనుంజయరెడ్డి

## పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ముఖ్యమంత్రి చుట్టూ ఉన్న కోటరీ ఆశీస్సులతో, జిల్లాలోని గూడూరు నియోజకవర్గానికి చెందిన కొడవలూరు ధనుంజయరెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి కూడా రేసులో ఉన్నారని వినికిడి.

నెల్లూరుజిల్లాకు చెందినంతవరకు బల్లి కళ్యాణ్‌కి చోటు దక్కని పరిస్థితులలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డికే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తాడేపల్లి సమాచారం. మాజీ ముఖ్యమంత్రి కుమారుడిగా, పార్టీ పటిష్టతకోసం నిత్యం శ్రమిస్తున్న నాయకుడిగా, జిల్లాలో అందరినీ కలుపుకుపోగలిగిన సమర్ధనీయుడిగా అన్ని అర్హతలు రాంకుమార్‌రెడ్డికే ఉన్నాయన్నది పార్టీ వర్గాల అభిప్రాయం. ఎన్నికల సమయాలలో ఆయన సేవలను వాడుకుంటూ పదవుల విషయంలో ఆయనను విస్మరించడం సబబు కాదన్నది కూడా పార్టీ పెద్దల అభిప్రాయంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మరి పార్టీ అధినాయకుడి ఆలోచన ఎలావుందో వేచిచూడాలి..!

## 'ప్రభా'తం

# 'అమ్మభాష'కు ఆదరణ ఏదీ?..

'మన జీవితానికి ఆత్మ అమ్మభాషే' అన్నారు భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు.. ఎంత గొప్పమాట. అంతేకాదు, అమ్మభాషతోనే స్వావలంబన సాధ్యమవుతుందని, అమ్మభాష అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆయన పదేపదే గుర్తుచేస్తూనే ఉన్నారు కూడా. అయినా.. మన తెలుగు రాష్ట్రాల్లో తెలుగుభాషకు తగినంత ఆదరణ కనిపించడం లేదు. మాతృభాష పట్ల ఎవరూ నిరాదరణతో ఉండకూడదని, తెలుగు భాష వెలుగుదివ్వెలు ఏనాటికీ ఆరిపోకుండా కాపాడుకోవాలని పూర్వీకుల కాలం నుంచి నేటితరం పెద్దల వరకు పదేపదే చెప్తూనే ఉన్నా.. నేటికీ ఎంతో మందిలో ఆ స్ఫూర్తి కొరవడుతుండడం ఎంతైనా విచారకరం.

తెలుగు భాష ఎంతో గొప్పదని, తేటతేనియల భాష తెలుగుభాష అని మనం గొప్పలు చెప్పుకుంటూనే ఉన్నాం.. కానీ ఆచరణలో 'అమ్మభాష' పట్ల మనం నిజంగానే ఆదరణ చూపుతున్నామా?.. అన్నది పెద్ద ప్రశ్న. తల్లి తన బిడ్డల పట్ల ఎంత వాత్సల్యం చూపుతుందో, అమ్మభాష పట్ల కూడా మనం అంత అభిమానం చూపాలి. కానీ అలా చూపగలుగుతున్నామా?. అన్నది ఎవరికి వారు ఆలోచించుకోవాల్సిన విషయం. అమ్మ పట్ల, అమ్మభాష పట్ల ఏనాటికీ నిరాదరణతో ఉండకూడదని, తెలుగుభాష వెలుగు దివ్వెలు ఏనాటికీ ఆరిపోకుండా కాపాడుకోవాలని పూర్వీకుల కాలం నుంచి నేటి తరం పెద్దల వరకు పదేపదే చెప్తున్నా పట్టించుకునేవారెంతమంది?.. నేటికీ ఎంతోమందిలో ఆ స్ఫూర్తి నానాటికీ బాగా కొరవడుతోందని చెప్పడానికి ఎంతో విచారించాల్సి వస్తోంది. పుట్టినప్పటి నుంచి కాదు, తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే మనకు అమ్మభాష అలవడుతుంది. అందుకే మాతృభాషను జీవితాంతం ప్రాణప్రదంగా చూసుకోవాలి. మన విద్యాభ్యున్నతికి, మనోవికాసానికే కాదు మన జీవనాలకు.. జీవితాలకు కూడా దారిదీపం.. మన మాతృభాషే. అమ్మభాషే లేకుంటే జీవితమంతా అంధకారమే. అందుకే... 'మన జీవితానికి ఆత్మ అమ్మభాషే' అన్నారు భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు..ఎంత గొప్పమాట. అంతేకాదు, ప్రతి భాష తనకంటూ ఒక ప్రత్యేకమైన విలువలతో ఉంటుందని, ముఖ్యంగా మన విశిష్టమైన సంస్కృతికి భాషే కీలకమైనదని, భాష-సంస్కృతి-చరిత్ర అనేవి ఒకదానికొకటి విడదీయరాని బంధంతో ఉంటాయని, కనుక మాతృభాష అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆయన ఎన్నోసార్లు చెప్తూనే ఉన్నారు. దేశంలోనే ఎంతో ఉన్నతమైన ఉప రాష్ట్రపతి అంతటి గొప్ప స్థానంలో ఉన్నా ఆయన మాతృభాషల ప్రాధాన్యతను అవకాశం వచ్చినప్పుడల్లా ప్రజలకు వివరిస్తూ అద్వితీయమైన రీతిలో భాషాసేవ చేస్తుండడం భారతీయులందరికీ గర్వకారణం. ముఖ్యంగా తెలుగుభాష అభ్యున్నతికి ఆయన నిర్విరామ కృషి చేస్తుండడం ఎంతో అపూర్వమైన విషయం. ఇంతకన్నా స్ఫూర్తి మనకింకెవరు కావాలి?..అయినా..మాతృభాష పరిరక్షణలో మనం ఇంకా వెనుకబడే ఉన్నాం. అనేక రాష్ట్రాలవారికి ఉన్న నిబద్ధత కూడా తెలుగువారిలో కనిపించడం లేదు. ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో ఉన్న తెలుగువారు కూడా మాతృభాషను మరచిపోకుండా మాట్లాడుకోవడం చూస్తూనే ఉన్నాం. ఇతర భాషల పట్ల మమకారం ఉన్నా.. ఎందరో మహానుభావులు, భాషాభిమానులు మాతృభాషను మరిచిపోకుండా నేటికీ అమ్మభాషను పదిలంగా కాపాడుకుంటూనే ఉన్నారు. అమ్మభాషతో పాటు ఇతర భాషల్లో ప్రావీణ్యం పెంచుకుంటూ అభివృద్ధిపథంలో ముందుకు సాగుతూనే ఉన్నారు. వారికన్నా ధన్యజీవులు ఇంకెవరుంటారు?..అమ్మభాషను అలా అభిమానించే వారి నుంచైనా మనం స్ఫూర్తి పొందలేమా?...మన ఇరుగుపొరుగునే ఉన్న తమిళనాడు, కర్నాటకలను చూసైనా మన తీరును మార్చుకుంటున్నామా అంటే అదీ లేదు. మాతృభాషను కాపాడుకునేందుకు, తద్వారా తరతరాలకూ తరగని భాషాదీప్తులందించేందుకు ఎందరో మహానుభావులు, ఎంతోకాలంగా ఎనలేని పోరాటాలు చేస్తున్నవారూ దేశంలో లెక్కలేనంతమంది ఉన్నారు. కానీ మన తెలుగువారిదే దయనీయ పరిస్థితి. తెలుగు రాష్ట్రాల్లోనే అనేక రంగాల్లో తెలుగుభాష అభివృద్ధి పట్ల ఎనలేని నిర్లక్ష్యం, నిర్లిప్తత అలముకునే ఉన్నాయి. కాలం గడిచేకొద్దీ మన మాతృభాష కనుమరుగయ్యే ప్రమాదం ఎంతైనా ఉందని పరిశోధకులు, భాషావేత్తలు పదేపదే చెప్తున్నా పట్టించుకునేవారే కరువవుతున్నారు.

2008లో కేంద్రప్రభుత్వం నుంచి తెలుగుభాషకు ప్రాచీన హోదా వచ్చిందన్న సంతోషమే కానీ, దాదాపు పన్నెండేళ్ళపాటు మన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం మైసూరులోనే ఉండిపోవడం దయనీయం. అయినా ఎలాగో మన ఉపరాష్ట్రపతి, తెలుగుభాషకు వెలుగు కిరణమైన ముప్పవరపు వెంకయ్యనాయుడి పుణ్యమా అంటూ ఆ ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు తరలిరావడం, అదీ మహాభారతాన్ని ఆంధ్రీకరించి తెలుగుభాషామతల్లికి కంఠాభరణంగా సమర్పించిన కవిబ్రహ్మ మహాకవి తిక్కన నడయాడిన నెల్లూరుకు చేరడం ఎంతో అదృష్టం!.. అయినా దురదృష్టవశాత్తూ అది ఇక్కడి నుంచి తరలిపోయే పరిస్థితి రాకుండా దానిని కాపాడుకోవాల్సి ఉంది. తెలుగుభాషాభివృద్ధికి ఎంతగానో దోహదం చేసే ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎంతో ప్రాచీనమైన చరిత్ర ఉన్న తెలుగుభాష ఏనాటికీ కొడిగట్టకుండా వెలుగుభాషగానే దేదీప్యమానం అయ్యేలా చూసుకోవాలి. అందుకు ముఖ్యంగా తెలుగుప్రజలే కాక, మన తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ముందడుగు వేయాలి. కేంద్రప్రభుత్వంతో సమన్వయంగా వ్యవహరించి తెలుగుభాషకు వెలుగులందించేందుకు కృషిచేయాలి. తెలుగుభాష అభివృద్ధికి కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలి. చిన్నారులకు మాతృభాషలోనే విద్యాబోధనకు చిత్తశుద్ధితో బాటలు వేసి వారి మానసిక వికాసానికి, ఆత్మవిశ్వాసానికి, విజ్ఞాన సముపార్జనకు బాటలు వేయాలి. విద్యాలయాల్లోనే కాక పాలనాపరంగా కూడా అందరికీ అర్థమయ్యే మాతృభాషలోనే విధివిధానాలు సాగేలా చూడాలి.

నిజంగానే ఎంతో గొప్పదైన మన తేటతేనియల తెలుగు భాషను కాపాడుకుంటూ తరతరాల వారికీ తరగని వారసత్వ సంపదగా అందిస్తూ.. భావితరాలకు మనం మార్గదర్శకం కావాలి. మాతృభాష పరిరక్షణే ధ్యేయంగా అందరూ ముందుకు సాగాలి. అదే మనందరి పవిత్ర కర్తవ్యం కావాలి.

# అందరికీ ప్రత్యక్ష దైవం.. అమ్మే!

## - శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరితీర్థస్వామీజీ



ప్రతి ఒక్కరికీ పరమదైవం.. ప్రత్యక్ష దైవం అమ్మేనని, మాతృమూర్తి కన్నా మించినవారు ఎవరూ ఉండరు కనుకనే ఉపనిషత్తులు సైతం మాతృమూర్తిని దైవంగా భావిస్తూ 'మాతృదేవో భవ' అని ఉపదేశించాయని ఇనమడుగు శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరితీర్థ స్వామీజీ ఉద్బోధించారు. ఇటీవల అల్లూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల (సుబ్బయ్య బడి)లో మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన 'మాతృమూర్తి సేవా పురస్కారాలు-2021' కార్యక్రమంలో స్వామీజీ పాల్గొని అనుగ్రహభాషణం చేశారు. బిడ్డకు జన్మనిచ్చేటప్పుడు తల్లి పడే వేదన చెప్పడానికి మాటలు చాలవని, రక్తమాంసాలు ధారపోసి తల్లి తన బిడ్డకు ప్రాణం పోస్తుందని, బిడ్డను ప్రాణం కన్నా మిన్నగా భావించేది, బిడ్డ శ్రేయస్సు కోసం ప్రతిక్షణం తపించేది అమ్మేనన్నారు. జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యులవారు కూడా తాను సన్యాసం స్వీకరించే ముందు తన తల్లి అనుమతిని తీసుకున్నారని, ఆ తర్వాత కాలంలో తన మాతృమూర్తి అవసాన దశలో ఉన్నారని తెలుసుకుని తల్లి వద్దకు వచ్చి సేవలు చేశారని, అలాంటి మహనీయులంతా మనకు ఆదర్శం కావాలని అన్నారు. కన్నతల్లిని ఎవరూ విస్మరించకూడదని, వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేయకుండా ఆదరించి బిడ్డలు తమ తల్లి రుణం కొంతైనా తీర్చుకోవాలన్నారు. ట్రస్ట్ ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ ట్రస్టీ, అల్లూరీయుడు, ప్రస్తుతం విశాఖలో స్థిరపడిన మేడా మస్తాన్‌రెడ్డి తొలిసారిగా అల్లూరు గ్రామంలో నిర్వహించిన మాతృమూర్తి సేవా పురస్కారాల కార్యక్రమం అభినందనీయమని వక్తలందరూ కొనియాడారు. ఈ సందర్భంగా మాతృమూర్తి సేవలో తరిస్తున్న మేడా వెంకటరమణారెడ్డి, పచ్చబొట్ల వీరయ్య, కొల్లా ఆనంద్, పచ్చ మహేంద్ర, కారుమంచి కార్తీక్‌శర్మలకు మాతృమూర్తి సేవా పురస్కారాలను అందజేసి సత్కరించారు. ప్రముఖ అవధాని కోట రాజశేఖర్, రామకృష్ణ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మేడా రామకృష్ణారెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఎస్.నాగేశ్వరరావు, ఏకొల్లు రమణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెంచయ్య పాల్గొన్నారు.

## శనగకు మద్దతు ధర

## రూ. 5100

### మార్చి 15 నుంచి కొనుగోళ్ళు

జిల్లాలో సాగుచేసిన శనగపంటను వచ్చేనెల 15వ తేదీ నుంచి మద్దతుధరకు కొనుగోలు చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. నిర్దిష్ట నాణ్యతా ప్రమాణాలు కలిగిన పంటకు క్వింటాల్‌కు 5,100 రూపాయలు మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించిందని, మద్దతు ధర కంటే మార్కెట్ విలువ తక్కువగా ఉంటే మార్క్‌ఫెడ్ ద్వారా 30శాతం పంటలను కొనుగోలు చేయాలని నిర్ణయించారని ఈనెల 21న ఆయనో ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించి వచ్చే నెల 10వ తేదీ లోపు రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని, శనగలో 14 శాతం కంటే తేమ తక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## పెంచలస్వామికి

## 27న పుష్పయాగం

రాపూరు మండలం పెంచలకోనలో కొలువై ఉన్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామికి ఈనెల 27న కన్నుల పండువగా పుష్పయాగం నిర్వహించనున్నారు. మాఘ పౌర్ణమి సందర్భంగా ఆరోజున స్వామి వారికి, ఆదిలక్ష్మి-చెంచులక్ష్మి దేవి అమ్మవార్లకు ఉదయం స్నపన తిరుమంజనం, రాత్రికి అనేకరకాల సుగంధభరిత పుష్పాలతో పుష్పయాగం నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# రైతు బాంధవుడు.. వెంకయ్యనాయుడు

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

రాష్ట్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, కేంద్ర ఆహారశాఖ అధికారులను తనవద్దకు పిలిపించి, రాష్ట్రంలో రైతుల కష్టాలపై స్పందించిన ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు రైతు బాంధవుడు. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో రైతులు పండించే ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో భారత ఆహారసంస్థకు ఉన్న పరిమితులను సడలిస్తూ మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఆ విధంగా కొనుగోలు చేసేందుకు ఎఫ్‌సిఐని ఒప్పించి భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చారు. అలాగే రైస్‌మిల్లర్ల ప్రధాన సమస్యలైన బియ్యం కొనుగోలు సుముఖతా విధానం, తక్కువ పోషకాలున్న బియ్యం కొనుగోలు, తూనికల విధానం, పాలిష్ తగ్గించే అంశాలకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులను ఆహార, ప్రజాపంపిణీ వ్యవస్థ కార్యదర్శి ద్వారా క్షుణ్ణంగా తెలుసుకుని, పై మూడు జిల్లాల్లో ఉత్పత్తి అయిన అదనపు వరి ధాన్యం సేకరణ విషయంలో ఎఫ్‌సిఐకి ఉన్న పరిమితి కంటే అధిక నిల్వలను పారదర్శకంగా విశ్వసనీయమైన విధానంలో కొనుగోలు చేయించడంలో ఆ సంస్థను ఒప్పించడం హర్షదాయకం. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆంధ్రరాష్ట్రానికి ఓ వరం. రాష్ట్రంలోని ప్రజలు ఎక్కడ ఏ ఇబ్బందులు పడుతున్నా వాటిని తక్షణం పరిష్కరించేందుకు కేంద్రస్థాయిలో అధికారులతో చర్చిస్తూ రాష్ట్ర ప్రజానీకానికి తన తోడ్పాటును అందిస్తూ, సింహపురి సీమకే గర్వకారణంగా నిలుస్తున్నారు. భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు గారికి మా శుభాకాంక్షలు.

– డా.ఎస్ బాబూరావు, కావలి.

# ఈ ధరలు భరించలేకున్నాం బాబోయ్

రోజురోజుకీ పెట్రోల్ ధర పెరుగుతుండడం దారుణం. దీని ధరను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చొరవ తీసుకోకుంటే ఈ ధర ప్రభావంతో ఇతరత్రా రవాణా ఛార్జీలతో పాటు అన్ని సరుకుల ధరలు పెరుగుతాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెరుగుతున్న ధరలను చూసి బెంబేలెత్తిపోవాల్సివస్తోంది. ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వాలు ఎంతో కాలంగా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం ఆవేదన కలిగిస్తోంది. ధరలు పెరిగితే మాలాంటి సామాన్యులం ఏమి కొనాలి... ఏమి తినాలి...? ప్రభుత్వాలు ఆలోచించాలి.

– సోమశేఖరయ్య, పడుగుపాడు.

# పాత్రికేయునికి డాక్టరేట్

## ఆర్ఎం ఉమామహేశ్వరరావుకు అరుదైన గౌరవం



ప్రముఖ కథారచయిత, ఉత్తమ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్, నెల్లూరీయుడు ఆర్ఎం ఉమామహేశ్వరరావుకు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇటీవల డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'తెలుగు కథల్లో అమ్మ' అనే అంశంపై ప్రొఫెసర్ పేట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో రూపొందించిన విశిష్ట పరిశోధనకు గుర్తింపుగా ఆయనకు డాక్టరేట్ లభించడం విశేషం. అందులోనూ పాత్రికేయ వృత్తిలో ఉంటూ..మరోవైపు కథారచనలతో పాటు, తెలుగు కథలపై పరిశోధనలు కూడా చేస్తూ డాక్టరేట్ సాధించడమనేది చిన్నవిషయమేమీ కాదు. ఉమామహేశ్వరరావు ఎంతో శ్రమించి అలాంటి అరుదైన గుర్తింపును, గౌరవాన్ని తెచ్చుకోవడం ఆయనకే కాదు..కథా రచనా రంగానికి కూడా గర్వకారణం.

నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలోనే ఎంఏ (తెలుగు) పూర్తిచేశారు. ఆ తర్వాత ఎస్వీయు తెలుగు అధ్యయనశాఖలో పిహెచ్‌డి కోర్సులో చేరారు. తన పరిశోధనలో భాగంగా 1910 నుంచి ఇప్పటిదాకా 'అమ్మ' ప్రభావం ఉన్న వెయ్యి కథలను ఎంతో ఓర్పుతో సేకరించి వాటిని నిరంతరం అధ్యయనం చేసి పలు కోణాల నుంచి చక్కగా విశ్లేషిస్తూ తనదైన శైలిలో 600 పేజీల పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. ఆ కృషికి గుర్తింపుగా ఉమామహేశ్వరరావుకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు ఎస్వీయు పరీక్షల నియంత్రణాధికారి దామ్లానాయక్ తెలిపారు.

### కథా రచయితగా..ఉత్తమ జర్నలిస్టుగా..

ఉమామహేశ్వరరావు మంచి కథా రచయిత. ఆయన రాసిన ఎన్నో కథలు అనేక కథా సంకలనాల్లో ముద్రితమయ్యాయి. తెలుగు కథలను విశ్లేషిస్తూ అనేక వ్యాసాలు రాశారు. ఉత్తమ కథారచయితగా పలు అవార్డులను, పురస్కారాలను పొందారు. కథా రచయితగానే కాదు జర్నలిస్టుగా కూడా ఆయనెంతో ప్రసిద్ధి. అంతేకాదు, 'లాయర్' పత్రికతోనూ ఆయనకు అనుబంధం ఉంది. కళాశాలలో చదువుకునే రోజుల్లోనే ఆయన 'లాయర్' వారపత్రికకు విలేకరిగా పనిచేశారు. ఆ తర్వాత పలు దినపత్రికల్లో వివిధ స్థాయిల్లో బాధ్యతలు చేపట్టారు. పత్రికా రచయితగా ఆయన ఎన్నో సంచలనాత్మక కథనాలను వెలువరించి ఎన్నో విశిష్టమైన అవార్డులను అందుకున్నారు. 2015లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'ఉత్తమ జర్నలిస్టు' అవార్డును కూడా పొందారు. ప్రస్తుతం ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వృత్తిపరంగా పాత్రికేయవృత్తిలో బాధ్యతాయుతమైన స్థానంలో విధులు నిర్వహిస్తూనే, ప్రవృత్తిపరంగా తనకిష్టమైన కథ రచనలోనూ, కథల పరిశోధనల్లోనూ రాణిస్తూ 'డాక్టరేట్'ను కూడా సాధించిన ఆర్ఎం ఉమామహేశ్వరరావుకు 'లాయర్' శుభాభినందనలు.

# జగనన్నకు అందరూ అండగా నిలవాలి

## - సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



గతంలో ఎప్పుడూ కనీవినీ ఎరుగని విధంగా రాష్ట్ర ప్రజలకు, కుల, మత, వర్గాల తేడా లేకుండా పార్టీ రహితంగా అర్హులైన లబ్ధిదారులందరికీ అనేక రకాలైన సంక్షేమ పథకాలను చేపట్టి అమలుచేస్తూ, నిరంతరం ప్రజల అభ్యున్నతి కోసమే అహరహం కృషిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. ఈనెల21న నాయుడుపేటలోని తన నివాసంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినినాటి నుంచి ప్రజలకు సంక్షేమ పథకాలను ముమ్మరం చేశారని, అదేవిధంగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదలందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీచేయడమన్నది చరిత్రాత్మకమైన విషయమని, ఒకేసారి 31 లక్షల మంది పేదలకు ఇళ్ళపట్టాలు అందించడంతో పాటు, 16వేల ఇళ్ళకు శంకుస్థాపన కూడా చేయడం అద్భుతమైన విషయమని అన్నారు. మన రాష్ట్రంలో జరుగుతున్న ఇలాంటి అభివృద్ధిపనులను ఇతర రాష్ట్రాల వారు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారని కొనియాడారు. నాయుడుపేటలో కూడా కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధిపనులు జరుగుతుండడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. తొలుత వైకాపా యువజన నాయకుడు పొట్లపూడి రాజేష్ ఆధ్వర్యంలో అనేకమంది యువకులు ఎమ్మెల్యే నివాసానికి వచ్చి వైకాపాలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ ఎమ్మెల్యే సంజీవయ్య పార్టీ కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైకాపా పట్టణ అధ్యక్షుడు 786 రఫీ, నాయకులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కిషోర్‌యాదవ్, మద్దాలి సోమశేఖర్‌రెడ్డి, ఎద్దల ధనుంజయరెడ్డి, కటకం జయరామయ్య, బైనా మల్లికార్జున రెడ్డి, పేట చంద్రారెడ్డి, చదలవాడ కుమార్, పేర్నాటి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో 'స్కడా' సెంటర్

## ప్రారంభించిన ఏపిఎస్పీడిసిఎల్ సిఎండి హరినాధరావు



శ్రీసిటీలో విద్యుత్ అంతరాయాలు లేకుండా ఎంతో అధునాతనమైన రీతిలో ఈనెల 22న 'స్కడా' సెంటర్ ప్రారంభమైంది. విద్యుత్ సరఫరాలో ఏవైనా సమస్యలుంటే వాటిని వెంటనే గుర్తించి, సరఫరా వ్యవస్థను మెరుగుచేసేందుకు ఈ స్కడా సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఏపి సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్(ఏపిఎస్‌పిడిసిఎల్) ఛైర్మన్–మేనేజింగ్ డైరెక్టర్ హెచ్ హరినాధరావు శ్రీసిటీ సందర్శనలో భాగంగా శ్రీసిటీ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఈ స్కడా సెంటర్‌కు ప్రారంభోత్సవం చేశారు. తొలుత ఆయన శ్రీసిటీలో విద్యుత్ వ్యవస్థకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ డిస్కంకు సంబంధించి జిల్లా విద్యుత్ వినియోగంలో 10 శాతం శ్రీసిటీ వినియోగం కాగా, రెవెన్యూ పరంగా 50 శాతం శ్రీసిటీ ద్వారా లభిస్తోందని, శ్రీసిటీ తమకు అత్యంత విలువైన భాగస్వామి అని అన్నారు. ఇతర ప్రాంతాలతో పోల్చితే శ్రీసిటీలో మెరుగైన విద్యుత్ వ్యవస్థ ఉందని, పారిశ్రామిక విద్యుత్ అవసరాల కోసం ఇక్కడ మరో 133 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. పరిశ్రమలకు అత్యంత నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే కాక, మెరుగైన విద్యుత్ వ్యవస్థ కోసం స్కడా కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. పరిశ్రమల లోపల తరచుగా విద్యుత్ వ్యవస్థల నిర్వహణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ నెలలో ఒకరోజు పరిశ్రమల్లోను, ఏపిఎస్పీడిసిఎల్ సబ్‌స్టేషన్ల లోనూ విద్యుత్ వ్యవస్థలను క్షుణ్ణంగా పరిశీలించాలని చేసిన సూచనకు అందరూ ఆమోదం తెలియజేశారు. తొలుత సిఎండి హరినాధరావును ఆయన స్వాగతించి శ్రీసిటీలోని విద్యుత్ వ్యవస్థ గురించి వివరించారు. ఏపిఎస్పీడిసిఎల్ ముందస్తు చర్యల ఫలితంగా శ్రీసిటీలో పరిశ్రమలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అవుతోందని ఆయన సిఎండికి చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఎండితో పాటు ఏపి ట్రాన్స్‌కో సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఓఎంసి) ఎన్.ప్రతాప్‌కుమార్, ఏపిఎస్పీడిసిఎల్ ఎస్ఇ (ఆపరేషన్స్) వి.చలపతి తదితరులు పాల్గొన్నారు.

# రెడీ అవుతున్న పిఎస్ఎల్‌వి-సి 51

## 28న ఉదయం 10.23 గంటలకు ప్రయోగం



శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి పిఎస్ఎల్‌వి–సి51 ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈనెల 28వ తేది ఉదయం 10.23 గంటలకు రాకెట్‌ని నింగిలోకి పంపేందుకు ఇస్రో ఏర్పాట్లు చేస్తోంది. శాస్త్రవేత్తలంతా ఈ ప్రయోగం నిర్వహించే సన్నాహాల్లో తలమునకలై ఉన్నారు. రాకెట్ ప్రయోగానికి ముందుగా 25 గంటల కౌంట్‌డౌన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# శ్రద్ధాంజలి



## గునుపాటి హరిశ్చంద్రారెడ్డి గారు

జననం : 16.2.1933 మరణం : 23.2.2021

**మా ఆత్మబంధువు, ఆత్మీయ సింధువుకి అశృనివాళి.**



- తుంగా కుటుంబం

# నెల్లూరు కబుర్లు

## రంగనాధునికి స్వర్ణ గరుడసేవ



భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని నెల్లూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాధ స్వామికి నేత్రపర్వంగా బంగారు గరుడసేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి జగన్నాధాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఆలయ ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, ఇ.ఓ వెంకటేశ్వర్లు తదితరుల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వర్ణ గరుడవాహనంలో కొలువైన స్వామివారిని దర్శించుకున్నారు.

## రైళ్ళలో చోరీలు జరగకుండా చూడండి

**- రైల్వే డిజిపి ద్వారకా తిరుమలరావు**



వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో చోరీలు జరిగే అవకాశం ఉన్నందువల్ల రైల్వే పోలీసులు అప్రమత్తంగా ఉంటూ రైళ్ళలో దొంగతనాలు జరగకుండా చూడాలని, పాత నేరస్తులపై నిఘా పెంచాలని, రైళ్ళలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాళ్ళు భద్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, రైల్వే పోలీసులను రైల్వే డిజిపి ద్వారకా తిరుమలరావు ఆదేశించారు. ఈనెల 23న ఆయన నెల్లూరులోని రైల్వే డిఎస్పీ, సిఐ కార్యాలయాలను, నెల్లూరు రైల్వే స్టేషన్‌లోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో పోలీసు గస్తీ పెంచాలని, మత్తు పదార్థాల అక్రమ రవాణాను నిరోధించేందుకు నిరంతరం తనిఖీలు చేస్తుండాలని చెప్పారు. గుంతకల్ డివిజన్ రైల్వే ఎస్పీ పి.అనిల్‌బాబు, నెల్లూరు రైల్వే డిఎస్పీ టి.మురళీకృష్ణ, సిఐ శ్రీనివాసాచారి, ఎస్‌ఐలు సిరాజుద్దీన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ ధరలపై డిసిసి నిరసన

రోజురోజుకీ పెరిగిపోతున్న పెట్రోల్ ధరలపై ఆందోళన వ్యక్తం చేస్తూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 22న నెల్లూరులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలంటూ నినాదాలు చేశారు. యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గణేష్‌బాబుతో పాటు నాయకులు రాజేష్‌రెడ్డి, ఎస్‌కె సుభాని, మహేష్, ఆలి, ఫిరోజ్, పెంచలయ్య, మణి పాల్గొన్నారు.

## కథల పుస్తకం ఆవిష్కరణ



నెల్లూరుజిల్లా రచయితల సంఘం (నెరసం) ఆధ్వర్యంలో పలువురి కథలను ఒక సంకలనంగా రూపొందించి 'కాలుతున్న కాలం' అనే పేరుతో ఆ కథల పుస్తకాన్ని ఈనెల 22న ఆవిష్కరించారు. నగరంలోని టౌన్‌హాలు ప్రాంగణంలోని రీడింగ్‌రూమ్‌లో జరిగిన ఈ ఆవిష్కరణోత్సవంలో కథారచయితలు, పలువురు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని అగస్త్యరాజు సుబ్బారావు, సర్వేపల్లి రామమూర్తి, వదలి రాధాకృష్ణ, చలపాక ప్రకాష్, తన్నీరు శశికళ, ఎస్ అరుణ, పి.కుమార్‌లను సత్కరించారు. నెరసం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ.జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి, మెట్టు రామచంద్రప్రసాద్, ఎన్.కణ్ణన్, సిహెచ్ పెంచలరెడ్డి, సుభద్రాదేవి, న్యాయవాది రమాదేవి తదితరులు పాల్గొని మాతృభాష విశిష్టతను వివరించారు.

### చిన్నారులకు

## వ్యాధి నిరోధక టీకాలు

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం ద్వారా వారిని అనేక వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చని వైద్యాధికారి మోహసిన్ సుల్తాన్ అన్నారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఈనెల 22న నెల్లూరు నగరంలోని కోటమిట్ట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంపొందించడమే మిషన్ ఇంద్రధనుష్ లక్ష్యమన్నారు. డాక్టర్ మాధురి, చైతన్య, తిరుపతయ్య, సచివాలయ ఏఎన్‌ఎంలు సుజన, పెంచలమ్మ, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

### కరాటేలో

## బంగారు పతకాలు

జాతీయస్థాయి కరాటే పోటీల్లో నెల్లూరుజిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు తమ సత్తా చాటుతూ బంగారు పతకాలు సాధించారు. ఈనెల 21న కర్నాటకలో జరిగిన కరాటే పోటీల్లో 'కటా' విభాగంలో ఎన్.ఇందుమతి (డేవిస్‌పేట), ఎస్‌కె షిమిన్ జోయ (కొత్తూరు), ఎన్.ప్రియ, సిహెచ్ చంద్రశేఖర్ (నెల్లూరు) జి.మల్లికార్జునరావు (కొడవలూరు) బంగారు పతకాలు సాధించడం విశేషం. జిల్లా అసోసియేషన్ ఆఫ్ స్పోర్ట్స్‌కు చెందిన వీరు వచ్చే ఏడాది కాలిఫోర్నియాలో జరుగనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు అర్హత సాధించారని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురళి తెలిపారు.

## కాలేషా మృతి తీరని లోటు

**- బిజెపి నాయకుల నివాళి**

కొడవలూరు మండలంలోని యల్లాయపాళెంకు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు ఎస్‌కె కాలేషా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమని, పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేమని బిజెపి నాయకులు పేర్కొన్నారు. ఈనెల 22న వారు కాలేషా మృతికి విచారం వ్యక్తం చేస్తూ ఆయనకు ఘననివాళులర్పించారు. కాలేషా మృతి తీరని లోటని అన్నారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, దద్దోలు మాల్యాద్రి, మండలాధ్యక్షుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


## సామంతు సుబ్బారెడ్డి సేవలు మరువలేనివి

**- ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి**



ఇటీవలే పరమపదించిన కోవూరు షుగర్ ఫ్యాక్టరీ ఛైర్మెన్ సామంతు సుబ్బారెడ్డి కుటుంబాన్ని నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 20న పరామర్శించారు. సుబ్బారెడ్డి నివాసానికి వెళ్ళి ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. సమితి అధ్యక్షునిగా, షుగర్ ఫ్యాక్టరీ ఛైర్మెన్‌గా సామంతు సుబ్బారెడ్డి సేవలు మరువలేనివని ఆయన అన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### భక్తవత్సలరెడ్డి కుటుంబానికి పరామర్శ...

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని చింతారెడ్డిపాళెంకు చెందిన విశ్రాంత ఆర్డీఓ భక్తవత్సలరెడ్డి కుటుంబాన్ని కూడా ఆదాల ఈనెల 20న పరామర్శించారు. ఇటీవలే భక్తవత్సలరెడ్డి తండ్రి పరమపదించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదాల వెంట విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణా వెంకయ్య, మల్లు సుధాకర్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

### ఆదాలను కలసిన నాయకులు

నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డితో ఈనెల 23న పలువురు నాయకులు కలసి పలు అంశాలపై చర్చించారు. వైకాపా నాయకులు వైవి రామిరెడ్డి, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య, సుబ్బారెడ్డి తదితరులు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డితో జిల్లాకు చెందిన అనేక విషయాలను చర్చించారు.

### పావన పినాకినీ నదీజలాలతో..

## శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి అభిషేకం

- నేత్రపర్వంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో వెలసివున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయం తొలి వార్షికోత్సవ వేడుకలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఈనెల 21న అమ్మవారికి విశిష్టపూజలు నిర్వహించారు. తమలపాకులతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి పూజలు జరిపారు. ఉదయం విశేష పూజలు, సాయంత్రం హోమం నిర్వహించారు. ఈనెల 22న అమ్మవారికి కన్నులపండువగా కలశాభిషేకం జరిగింది. నగరంలోని రంగనాయకులపేట ఆలయం ప్రాంగణం నుంచి 1500 మంది భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పావన పినాకినీ నదీజలాలను కలశాల్లో నింపుకుని ఊరేగింపుగా తీసుకునివచ్చి అమ్మవారిని అభిషేకించారు. ఈ సందర్భంగా జై వాసవీమాతా!..జైజై వాసవీమాతా అంటూ భక్తులు పెద్దపెట్టున చేసిన అమ్మవారి నామస్మరణలతో నగరవీధులు మార్మోగాయి. సాయంత్రం అమ్మవారికి విశేషపూజల సందర్భంగా అమ్మవారిని ముత్యాలచీరతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు శివస్వామి ఆధ్వర్యంలో ఈ పూజలు కన్నులపండువగా జరిగాయి. 23వ తేదీన భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలో 300 మంది దంపతులతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు దాసా సురేష్‌రాజా, కార్యదర్శి అయితా రామచంద్రరావు, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులుతో పాటు సరాబు సుబ్రహ్మణ్యం, పేర్ల సీతారామారావు, కోట సూర్యనారాయణ, ముక్కాల ప్రేమ్‌చందన్, అయితా భాస్కర్, చలువాది శరణ్‌కుమార్, శ్రీరాం సురేష్, మేడా కామేశ్వరరావు, ఒమ్మిన ఈశ్వర మురళీకృష్ణ, నున్నా రమేష్, గంగిశెట్టి మల్లికార్జున, బైసాని సత్యకృష్ణ, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## అన్నం సరిగా పెట్టండి

**హాస్టల్ విద్యార్థుల సమస్యలపై విద్యార్థి జేఏసి వినతి**

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ళలో చదువుకుంటున్న విద్యార్థులకు అన్నం సక్రమంగా పెట్టాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం పెట్టని దుస్థితి అనేక హాస్టళ్ళలో ఉందని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసి నాయకులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఈనెల 20న ఆ సంఘం నాయకులు జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జేఏసి రాష్ట్ర నాయకుడు పి.ఆదిత్య సాయి మాట్లాడుతూ నెల్లూరు నగరంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని కళాశాల హాస్టల్‌లో విద్యార్థులకు కనీస వసతులు లేక విద్యార్థులు ఎంతో ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు సకాలంలో అన్నం పెట్టకపోవడంతో విద్యార్థులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. హాస్టల్‌లో మరుగుదొడ్లు సరిగా లేవని, మంచి నీటి వసతి కూడా సరిగా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యలపై దృష్టిసారించాలని, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి వెంటనే స్పందించి విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. శ్యామ్, రాజేష్, అశోక్, సంతోష్, మధు పాల్గొన్నారు.

## గీతామయిలో అన్నదానం

మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవం, వివాహ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 20న నెల్లూరులోని చిరంజీవి యువత ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని గీతామయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు చిరంజీవి దంపతులకు తమ ఆశీస్సులందజేశారు. చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌తో పాటు చిరంజీవి అభిమానులు, గీతామయి వృద్ధాశ్రమం నిర్వాహకులు పాండు తదితరులు పాల్గొని కేక్‌ను కట్‌చేసి వృద్ధులకు పంపిణీ చేశారు.

### పింఛనర్ల డిఏ

## బకాయిలు ఇవ్వండి

పింఛనర్లకు రావాల్సిన డిఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఈనెల 23న ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మొదటి విడత బకాయిలను త్వరితగతిన విడుదల చేయాలని ఆయన కోరారు.

## వెంకటగిరి రాజాగారి కోటలో చిన్ని నారాయణరావు 'మాట' ఆవిష్కరణ



# 'మాట'ంటే ఒక అస్త్రం... ఒక శస్త్రం

## - ఎస్‌విబిసి ఛైర్మన్ వి.బి.సాయికృష్ణ యాచేంద్ర

**మా**ట విలువ పడిపోతున్న నేటికాలంలో మాటకున్న విలువ చలువ తెలియచెప్పే విధంగా కవి చిన్ని నారాయణరావు 'మాట' పేరుతో దీర్ఘకవితను రాయడం అభినందనీయమని సరస్వతీపుత్రులు, సంగీత గేయధార సృష్టికర్తలు, శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ ఛైర్మెన్ డా॥ వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్ర అన్నారు.

ప్రముఖ సాహితీవేత్త నెల్లూరు సినారా, చిన్ని నారాయణరావు మరికొన్ని మాటల సమాహారంతో తాజాగా రూపొందించిన 'మాట' దీర్ఘ కవితను, ఫిబ్రవరి 21వతేదీ, ఆదివారం ఉదయం వెంకటగిరిలో రాజా వారి కోటలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా యాచేంద్ర మాట్లాడుతూ అసత్యమైన జీవితాన్ని నమ్ముకుని, చాలామంది అబద్ధాల ప్రపంచంలో బ్రతికేస్తున్నారని అన్నారు. ఆచరించలేని మాటకు విలువ లేదని అన్నారు. మాట ఒక అస్త్రం, శస్త్రం లాంటిదని, అయోగ్యమైన మాటలు మాట్లాడడం, ఆడిన మాట తప్పడం వంటివి మంచిది కాదని అన్నారు. ఒకసారి మాట ఇస్తే అది శాసనం లాంటిదని, మనం ఇచ్చిన మాట వల్ల మనకు నష్టం వచ్చినా, ప్రళయమొచ్చినా ఎదుర్కొని నిలబడాలని తమ తండ్రి తమకు నేర్పించారని చెప్పారు. అదే సిద్ధాంతాన్ని తాము ఇప్పటికీ పాటిస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటున్నామని యాచేంద్ర అన్నారు.

### మనకు కనిపిస్తూ... వినిపించే విషయాలే ఈ 'మాట'

**- వి.యస్.యు రిజిస్ట్రార్ యల్.వి.కె రెడ్డి**

సమాజంలో నిత్యం మనకు కనిపించే సంఘటనలతో పాటు, వినిపించే విషయాలనే సున్నితంగా సృజించి చిన్ని నారాయణరావు 'మాట' రూపంలో అందించాడని ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న విక్రమ సింహపురి రిజిస్ట్రార్ యల్.విజయ కృష్ణారెడ్డి అన్నారు. నాటి పురాణాల నుండి, నేటి రాజకీయాలతో సహా, సమాజంలో మానవ జీవితంతో ముడిపడి ఉన్న అనేక వాస్తవ సంఘటనలను ఆయన ఈ పుస్తకంలో పొందుపరచాడన్నారు. చదువుతున్నంత సేపు అనుభవిస్తున్న భావన కలుగుతుందని అన్నారు. వ్యక్తిత్వ వికాసం, వ్యాపార విజయం వంటి అంశాల్లో సైతం మాట విలువకు ఉన్న ప్రాధాన్యతను చిన్ని నారాయణరావు తెలియచెప్పడం అభినందనీయమని, రేపటి తరాలవారికి ఈ మాట బంగారు బాట వేయగలుగుతుందనడంలో సందేహం లేదన్నారు.

### నా మాటలకు మీ మాట ఊతం అవుతుందని ఉపరాష్ట్రపతి అన్నారు

**- 'లాయర్' సంపాదకుడు ప్రభు**

చిన్ని నారాయణరావు రాసిన మాట ఆంగ్లానువాదం 'ది వర్డ్' కొత్తఢిల్లీలో భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు ఆవిష్కరించారని, ఆ సందర్భంలో ఆయన మాట్లాడుతూ తన మాటలకు ఈ 'మాట' ఊతం అవుతుందని ప్రశంసించడం నారాయణరావు ప్రతిభకు తార్కాణమని మరో అతిధి, 'లాయర్' వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి అన్నారు. 'చిన్ని' కుటుంబంతో తుంగా కుటుంబానికున్న చిరకాల అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నాడు. అడిగీ అడగంగానే 'మాట' ఆవిష్కరణకు కోటను వేదికగా చేసినందుకు రాజాగారికి కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం రోజున ఈ కార్యక్రమం జరగడం ఆనందదాయకం అన్నారు.

### నా అనుభవాలే నన్ను ప్రోత్సహించాయి

**- రచయిత చిన్ని నారాయణరావు**

తాను ఒక చిన్న పల్లెటూరునుండి వచ్చానని, చిన్నతనం నుండి తన చుట్టూ మాట్లాడే మాటల ప్రభావమే తనను 'మాట' రాయడానికి ప్రేరేపించిందని కవి, 'మాట' రచయిత చిన్ని నారాయణరావు అన్నారు. మృదుమధురమైన మాటలతో కొందరు తనను ఆకట్టుకుంటే, కట్టె విరిచి పొయ్యిలో పెట్టేలా మాట్లాడే మరికొంతమంది మాటలతో ఆందోళన చెందేవాడినని, అలాంటి ఎన్నో సంఘటనల అనుభవాలే తాను డిగ్రీ చదివే రోజుల్లో ఈ 'మాట'కు శ్రీకారం చుట్టడానికి ప్రోత్సహించాయని నారాయణరావు చెప్పారు. తన మాటకు రాజా గారి కోటాలో చోటు కల్పించినందుకు యాచేంద్రగారికి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటివరకు 6 పుస్తకాలు రాసి ప్రచురించిన తాను పెద్దల ప్రోత్సాహంతో భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడేలా మరికొన్ని పుస్తకాలను వెలువరించే ప్రయత్నం చేస్తానన్నారు. భారతదేశంలోనే 'మాట'మీద వచ్చిన తొలి దీర్ఘకవిత తన మాటే కావడం గర్వంగా ఉందన్నారు.

ఆడిటర్ చిన్ని శ్రావణ్‌కుమార్ నిర్వహణలో, దాదాపు గంటన్నర పాటు జరిగిన ఈ కార్యక్రమంలో యల్.వి.కె.రెడ్డి, చిన్ని నారాయణరావులు సాయికృష్ణ యాచేంద్రను సత్కరించారు. యాచేంద్ర కూడా అతిధులందరికీ శాలువలతో స్వాగతం పలికారు. ఆత్మీయ వేడుకలా జరిగిన ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియన్ బ్యాంకు నెల్లూరు నగర శాఖ మేనేజర్ విశ్వనాథ్‌రెడ్డి, సూళ్లూరుపేట చెర్రీస్ రెస్టారెంట్ సారధి చరణ్, రాజా గారి ఆత్మీయులు, మీడియా మిత్రులు పాల్గొన్నారు.






నిర్యాణం : 1995, మార్చి 1వ తేదీ

స్వర్గీయ శ్రీమతి రుక్మిణమ్మ

(స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారి ధర్మపత్ని)

మాతృదేవోభవ

మా మాతృమూర్తి దైవసన్నిధికి చేరి

26 ఏళ్ళు నిండనున్న సందర్భంగా

ఆమె ఆత్మశాంతికై

భగవంతుని ప్రార్థిస్తూ...

ఆమె ఆత్మీయులైన వారందరికీ

మా మాతృదేవత

ఆశీస్సులు కోరుకుంటూ...

డా॥ టి.సుబ్బరామిరెడ్డి

మాజీ రాజ్యసభ సభ్యులు

మరియు

వారి కుటుంబసభ్యులు

### తండ్రి స్మారకంగా..

# తనయుని సేవా కార్యక్రమాలు

## నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతి రోజున ఎన్‌బికెఆర్‌లో రక్తదానం



రక్తదానం చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత స్వర్గీయ నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 86వ జయంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు, నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మెన్, విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల20న రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత రామ్‌కుమార్‌రెడ్డి తన తండ్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి జయంతి నాడు ప్రతిఏటా రక్తదాన కార్యక్రమంతో పాటు మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. రామ్‌కుమార్‌రెడ్డితో పాటు ఆయన అభిమానులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అనేకమంది రక్తదానం చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. వీరంతా కలిసి మొత్తం 255 యూనిట్ల రక్తాన్ని దానం చేయడం విశేషం. నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు ఆయన సిబ్బంది ద్వారా 157యూనిట్ల రక్తాన్ని సేకరించారు. అదేవిధంగా గూడూరు ఆసుపత్రి నుంచి డాక్టర్ గంగాధరం, ఆయన సిబ్బందితో కలిసి మరో 98 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ఎన్‌బికెఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య, మేనేజర్ రామకృష్ణారెడ్డి పాల్గొని నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి ఘన నివాళులర్పించారు.

# కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నేత

**- చేవూరు నివాళి**



స్వర్గీయ నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్‌నేతగా పార్టీకి ఎనలేని సేవలు చేశారని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచారని, ఇందిరాగాంధీ నేతృత్వంలో పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషిచేశారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి గుర్తుచేశారు. ఈనెల 20న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో అప్పట్లో ఇందిరాగాంధీతో ఎంతో సన్నిహితంగా ఉన్న పదిమందిలో జనార్దన్‌రెడ్డి ముఖ్యమైనవారుగా ఉండేవారని, ముఖ్యమంత్రిగానే కాక రాజ్యసభ సభ్యునిగా, పార్లమెంట్ సభ్యునిగా, శాసనమండలి, శాసనసభ.. ఇలా అన్ని చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించిన నేతగా నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సేవలందించారని కొనియాడారు. క్రమశిక్షణ, నిబద్ధత గల జనార్దన్‌రెడ్డి తన తుదిశ్వాస వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉండి ఎంతోమందిని రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దారని, నాయకులకు కార్యకర్తలకు అందరికీ ఆదర్శంగా నిలిచారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన సొంతజిల్లా నెల్లూరు అభివృద్ధికి కృషిచేశారని, నెల్లూరు జిల్లాకి 9వ పోలీసు బెటాలియన్, హ్యాండ్లూమ్ టెక్నాలజీ కేంద్రం, నిమ్మ పరిశోధనా కేంద్రంతో పాటు స్వర్ణముఖి బ్యారేజీ, మత్స్యకళాశాల వంటి అనేక ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలందరి ఆదరాభిమానాలను చూరగొన్నారని అన్నారు. అనంతరం ఇందిరాభవన్ ఇన్‌చార్జి, డిసిసి ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్, నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఫయాజ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ అల్లావుద్దీన్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పప్పర్తి గణేష్‌బాబు, కాంగ్రెస్ నాయకులు షేక్ హుస్సేన్‌బాషా, మావులూరు సురేష్‌బాబు, అరవ రామ్మోహన్‌రావు, ఎస్ రాజేష్‌రెడ్డి, షేక్ రెహమాన్, మహ్మద్ సర్వరాజ్ షబ్బీర్, షేక్ రహ్మతుల్లా, షేక్ ఫాజిల్, హాజీ, హనీఫ్, షేక్ అబిద్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# పన్నులు వెంటనే చెల్లించాలి

**- కమిషనర్ ఓబులేసు**



గూడూరు పురపాలక సంఘం పరిధిలో పన్ను బకాయిదారులు వెంటనే పన్నులు చెల్లించాలని కమిషనర్ ఓబులేసు ఈ నెల 22న తెలిపారు. బకాయిదారులకు ఇప్పటికే డిమాండ్, ఈఎస్‌డీ నోటీసులు జారీ చేశామని, వారు వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ నెల 28వ తేదీలోగా పన్నులు చెల్లించాలని కోరారు.

# గురువులకు పాదపూజ



గూడూరు సొసైటీలోని ప్రాస్పర్ పాఠశాల వ్యవస్థాపకులు దశరథరామిరెడ్డి, పాఠశాల మాజీ ప్రిన్సిపాల్ లక్ష్మిలకు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగిశెట్టి ధర్మయ్య, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ జేఏసీ కార్యదర్శి షేక్ ఇర్షాద్ ఆధ్వర్యంలో ఇటీవల ఆ పాఠశాలలో ఘనంగా సన్మానం జరిగింది. ఈ పాఠశాలలో చదివి డాక్టర్లుగా ఎదిగిన డాక్టర్ నాగిశెట్టి ధర్మతేజ, డాక్టర్ నాగిశెట్టి శ్రీదివ్య, డాక్టర్ నాగిశెట్టి శ్రీదీప్తి వారిరువురినీ శాలువా, పూలదండలతో సన్మానించడమేగాక, విద్యాదానం చేసినందుకు వారిరువురికి పాదపూజను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల నానమ్మ నాగిశెట్టి మస్తానమ్మ దశరథరామిరెడ్డి దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఒకనాటి తమ విద్యార్థిని విద్యార్థులు, తాము ఒక స్థాయికి చేరిన నేపథ్యంలో ఉపాధ్యాయులను గుర్తుపెట్టుకొని, తమను గౌరవించడం తమకెంతో ఆనందాన్ని కలిగించిందన్నారు.

### రామయ్య మందిరానికి

# సిఆర్ రెడ్డి లక్ష విరాళం



శ్రీ రాముని జన్మభూమి అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి గూడూరులోని ప్రముఖ వైద్యసంస్థ సి.ఆర్.రెడ్డి హాస్పిటల్ అధినేతలు డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, డాక్టర్ రోహిణిలు శ్రీరామునిపై ఉన్న భక్తితో రూ.1,00,116/-లు అందజేశారు. ఈ విరాళాన్ని చెక్కు రూపంలో గూడూరు విహెచ్‌పి అధ్యక్షులు మల్లెమాల మురళీరెడ్డి, నిధి ప్రముఖ్ ఆర్.కృష్ణరాజులకు అందజేశారు. అలాగే మాలవ్యానగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వి.మోహన్‌సాయికుమార్ రూ.71,000/-, శ్రావణి జ్యూయలరీ అధినేత శేగు వెంకటలక్ష్మీప్రసాద్ రూ.25,116/- అందజేశారు.

### ● గూడూరు చారిత్రక చిహ్నం

# గడియార స్తంభం కూల్చివేత



దశాబ్దాల కాలం నుండి గూడూరుకు తలమానికంగా ఉన్న గడియారం స్తంభాన్ని పురపాలక సంఘం అధికారులు నేలమట్టం చేసే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. గూడూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జివిస్ రాములు దాతగా గూడూరు రైల్వేస్టేషన్ ఎదురుగా పట్టణం నడి బొడ్డున నాలుగు రోడ్ల కూడలిలో దశాబ్దాలక్రితం ఈ గడియారం స్తంభాన్ని నిర్మించారు. గూడూరు పట్టణానికి మకుటాయమానంగా అప్పట్లో దీని శిఖరంలో 4పెద్ద గడియారాలను ఏర్పాటు చేశారు. ఈ గడియారం స్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళన పట్టణ ప్రజల్లో ఉండేది. ఈ నేపథ్యంలో పురపాలకసంఘ అధికా రులు సోమవారం నుండి ఈ గడియారం స్తంభం కూల్చివేత కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో పట్టణ నడిబొడ్డులో గూడూరు అంటే గుర్తుకు వచ్చే గడియారం స్తంభం ఇక కనుమరుగు కానుంది. ఈ కూల్చివేత పనులను గూడూరు పురపాలక సంఘం కమిషనర్ ఓబులేసు పర్యవేక్షిస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ ఓబులేసు మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖ అధికారులు ఈ గడియారం స్తంభానికి కాలం చెల్లిపోయిందని సర్టిఫికేట్ ఇవ్వడంతో దీనిని తొలగిస్తున్నామని, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్మాణం ఇక్కడ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.

### 'కనుమూరు' ఆధ్వర్యంలో..

# 'గ్రేటర్ గూడూరు' అభివృద్ధికి శ్రీకారం



గూడూరు అభివృద్ధిని కాంక్షిస్తూ వైకాపా నాయకుడు కనుమూరు హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'గ్రేటర్ గూడూరు డెవలప్‌మెంట్ అసోసియేషన్' ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఉదయం అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవనంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని గూడూరు అభివృద్ధి కోసం చేపట్టవలసిన పలు కార్యక్రమాలపై సలహాలు సూచనలు అందజేశారు. కనుమూరు హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా అన్ని వర్గాల, అన్ని రంగాల ప్రజలను కలుపుకుని గూడూరు అభివృద్ధికి తాను కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నిర్వహణకు తనవంతుగా లక్ష రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించారు. గతంలో బాటసారుల కోసం దాతలు నిర్మించిన సత్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయని అధికారులు వాటిని కూల్చివేసే ముందు దాతల కుటుంబసభ్యులకు తెలపకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో గూడూరు మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రముఖులు దశరథరామిరెడ్డి, శ్రీకంఠి రామ్మోహన్‌రావు, రియాజ్ అహ్మద్, హనుమంతరావు, బాలయ్య, లాయర్ గోపీకృష్ణ, దేవానంద్, వాయుగుండ్ల సుధాకర్, భాస్కర్‌గౌడ్, పెంచలయ్య, బిల్లు చెంచురామయ్య, చిరువెళ్ళ అనీల్‌కుమార్, దాసరి వెంకటేశ్వర్లు, వాశిలి ప్రవీణ్, రూపేష్‌రెడ్డి, ఉదయ్‌కుమార్(బుజ్జి), పెంచల్‌రెడ్డి, వాశిలి అనీల్, శ్యామ్, ప్రతాప్‌రెడ్డి, సాయి, రుదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారుల సేవలో 'ప్రగతి'



ఈ నెల 21వ తేదిన విందూరులోని హైస్కూల్ ప్రక్కన ఉన్న క్రికెట్ గ్రౌండ్‌లో క్రీడాకారుల కోరిక మేరకు ప్రగతి సేవా సంస్థ జాయింట్ సెక్రెటరీ యమహా సుబ్రమణ్యం, గ్రానైట్ ప్రభాకర్ సహాయ సహకారాలతో రెండు సిమెంట్ బల్లలను అందజేశారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బండి ధనంజయరెడ్డి, సెక్రెటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, గ్రౌండ్ క్రీడాకారులు నాగరాజు, శ్రీకాంత్, రామ్మోహన్‌రావు, పి.డి.కరిముల్ల, ప్రజేంద్రరెడ్డి, ఐ.టి.ఐ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వసిద్ధి ప్రదాయకుడు..సిద్ధన కొండూరు సిద్ధేశ్వరుడు

**ఆదిదేవుడు, మహాదేవుడు, భక్త వరదుడైన ఆ పరమేశ్వరునికి ప్రతిరూపంగా వెలసిన దివ్యమైన ఆలయాలు నెల్లూరు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. ఎంతో ప్రాచీన కాలం నుంచి ఉన్న అనేక శివాలయాలు అనాదిగా భక్తుల పూజలందుకుంటున్నాయి. అలాంటి ప్రసిద్ధమైన శైవ క్షేత్రాల్లో కలిగిరి మండలంలోని సిద్ధన కొండూరు కొండపై వెలసిన శ్రీ సిద్ధేశ్వరస్వామి దేవాలయం ఒకటి.**

పచ్చని ప్రకృతి సోయగాల మధ్య, పచ్చని చెట్లతో కళకళలాడే సిద్ధన కొండూరు కొండమీద ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసివున్న శ్రీ సిద్ధేశ్వరస్వామి దేవాలయం ఎంతో కాలంగా భక్తులను ఆకట్టుకుంటూ ఉంది. లయకారుడైన ఆ పరమేశ్వరుడు అత్యద్భుత మైన లింగరూపంలో ఇక్కడ కొలువై శ్రీ సిద్ధేశ్వరస్వామిగా అవతరించి భక్తులను కటాక్షిస్తున్నాడు. భక్తులు ఇక్కడికి వచ్చి ఆ పరమేశ్వరుని భక్తితో దర్శించుకుంటే కష్టాలు కడతేరి పోతాయి.



మన దేవాలయాలు (35)

## చోళరాజుల కాలం నాటి ఆలయం :

సిద్ధన కొండూరులోని శ్రీ సిద్ధేశ్వరాలయాన్ని 12వ శతాబ్దిలో చోళరాజులు నిర్మించారని ఇక్కడ లభించిన శిలాశాసనాల ద్వారా తెలుస్తోంది. ఆ కాలం నుంచే శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో పార్వతీదేవి-గంగాదేవి ఆలయాలు కూడా ఉండేవి. నాటి నుంచి ప్రతినిత్యం ఇక్కడ స్వామివారికి, అమ్మవార్లకు నిత్యపూజలు జరుగుతున్నాయి. గర్భాలయంలో కొలువై ఉన్న శివలింగం ఎంతో మహిమాన్వితమైనదని ప్రతీతి. ఇటీవలి కాలంలో భక్తులు, దాతలు, స్థానిక ప్రముఖులు అందరూ కలసి ఈ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నూతన ధ్వజ స్తంభంతో పాటు ఇరవై అడుగుల ఎత్తున్న మహాదేవుని విగ్రహాన్ని, శ్రీ విఘ్నేశ్వరాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మందిరాలతో పాటు అయ్యప్పస్వామి ఆలయాన్ని నెలకొల్పారు.

## నేత్రపర్వంగా.. శివరాత్రి మహోత్సవాలు


ఈ ఆలయంలో ప్రతిఏటా వైభవంగా శివరాత్రి మహోత్సవాలు జరుగుతుంటాయి. ఆ రోజున స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేస్తుంటారు. రాత్రి 11గంటల నుంచి లింగోద్భవ పూజలు వేడుకగా జరుగుతాయి. జిల్లాలో మరెక్కడా లేనివిధంగా అమోఘమైన రీతిలో ప్రభలు కట్టి మేళతాళాలతో గంగా పార్వతీ సమేత శ్రీ సిద్ధేశ్వర స్వామివారికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఆ తర్వాత కొండపై వేంచేపు చేయడం ఎంతోకాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. ఉదయగిరి నుంచి సుమారు 62 కిలోమీటర్లు, జిల్లా కేంద్రమైన నెల్లూరు నుంచి 58 కిలోమీటర్లు, కావలి నుంచి కేవలం 28 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. సిద్ధన కొండూరుకు, కొండమీద కొలువై ఉన్న శ్రీ సిద్ధేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు చక్కని రోడ్డుమార్గం ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఇక్కడ ఉచిత గదులు, తదితర వసతులన్నీ ఉన్నాయి. దీంతో భక్తుల సంఖ్య కూడా ఇటీవలి కాలంలో గణనీయంగా పెరుగుతూ ఉంది.

# ప్రశాంతంగా పంచాయతి

జిల్లాలో పంచాయతి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని మొత్తం 46 మండలాల్లో ఉన్న 941 గ్రామ పంచాయతీలు, 8,842 వార్డులకు ఎన్నికలు జరిగాయి. నాలుగు దశల్లో ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలోని 5 రెవెన్యూ డివిజన్లలో జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొదటగా ఈనెల 19 న కావలి రెవెన్యూ డివిజన్‌లోను, 2వ విడత ఈనెల 13న ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లోను, 3వ విడత ఈనెల 17న గూడూరు, నాయుడు పేట డివిజన్లలోను, 4వ విడత ఎన్నికలు ఈనెల 21న నెల్లూరు డివిజన్ లోను జరిగాయి. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పల్లెజనం పోలింగ్ కేంద్రాలకు భారీసంఖ్యలో తరలివచ్చారు. అధికారులు వారికి సజావుగా, స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ప్రశాంత వాతావరణం కలిగించారు. దీంతో ఎక్కడా హింసాత్మక ఘటనలు లేకుండా, రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఎన్నికల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంత రాలు లేకుండా జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, ఎస్పీ భాస్కర్ భూషణ్‌లు కట్టుదిట్ట మైన చర్యలు తీసుకోవడంతో పాటు అధికారులు, పోలీసులు, ఉద్యోగులంతా అహర్నిశలు ఎంతో కష్టపడి ఈ ఎన్నికలను జయప్రదంగా జరిపించారు.

## తుది విడత పోలింగ్ 77.24 శాతం :

జిల్లాలో తుది విడత పంచాయతి ఎన్నికల పోలింగ్ (నాల్గవ విడత) ఈనెల 21న ప్రశాంతంగా ముగిసింది. నెల్లూరు డివిజన్‌లోని 12 మండలాల్లో మొత్తం 77.24 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియ అంతా శాంతియుత వాతావరణంలో జరిగి విజయవంతం కావడంతో అధికారులు, పోటీల్లోని అభ్యర్థులు.. ప్రజలు అందరూ సంతోషించారు. ఎన్నికల ప్రక్రియ అంతా ముగిశాక ఈనెల 21న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, పోలీసు సిబ్బందికి అందరికీ కృతజ్ఞతలు చెప్పారు.

# మళ్ళీ ముంచిన వాన



- అకాలవర్షాలతో కష్టాలు
- తడిసిపోయిన ధాన్యం రాశులు
- లబోదిబోమంటున్న అన్నదాతలు

**నైరుతి బంగాళాఖాతంలో ఇటీవల ఉపరితల ద్రోణి ఏర్పడి, దాని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉరుముల మెరుపులతో పాటు అకాలవర్షాలు కురిశాయి. రాయలసీమలతో పాటు నెల్లూరు జిల్లాలోనూ అనేక మండలాల్లో గత శుక్రవారం నుంచి ఆదివారం దాకా అక్కడక్కడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవడంతో రైతులు బాగా నష్టపోయారు. కోతకు వచ్చిన పంటలు నేలవాలిపోవడం, చేతికందివచ్చిన ధాన్యం రాశులు తడిసిపోవడంతో రైతులు నష్టాల పాలయ్యారు.**

అదేం దురదృష్టమో తెలియదు కానీ, పంటలు చేతికొచ్చేదశలోనూ జిల్లాలోని రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది వరుణుడి కరుణతో పుష్కలంగా సాగునీళ్ళుండడంతో రైతులు ఎంతో ఉత్సాహంగా పంటలు వేసుకుంటే ఇప్పుడు అకాలవర్షాలొచ్చి తమను అపార నష్టాలకు గురిచేశాయంటూ అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ధాన్యం దిగుబడులు కూడా బాగా వచ్చాయని సంతోషిస్తూ ధాన్యం నూర్పిళ్ళు చేసుకుని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని అనుకుంటున్న తరుణంలోనే అకాల వర్షాలు రావడంతో రైతులు అయోమయంలో పడ్డారు. ఆరుగాలం కష్టపడి పంటపొలాలు సాగుచేసుకున్న రైతులు దీంతో మళ్ళీ ఇప్పుడు కష్టనష్టాలకు గురయ్యారు. గత శుక్రవారం మధ్యాహ్నం నీలిమబ్బుల ఛాయ లేకుండానే ఉన్నట్లుండి భారీ వర్షం కురవడంతో కోతకు సిద్ధంగా ఉన్న పంటలు నేలవాలిపోయాయి. ధాన్యం కోతలో ఉన్న రైతులు, పంట నూర్పిళ్ళు జరిగి ధాన్యాన్ని రాశులుగా పోసి రేపోమాపో కొనుగోళ్ళు జరిగిపోతాయనుకుంటూ వాటిని సిద్ధం చేసుకుంటున్న రైతులు ఒక్కసారిగా భారీగా కురిసిన వానతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కళ్ళ ముందే పండిన ధాన్యమంతా తడిసిపోతుంటే రైతులు దిక్కుతోచక కన్నీళ్ళు పెట్టుకున్నారు. ఆ తర్వాత మరో రెండు రోజులు కూడా వానలు వదల్లేదు. శనివారం 11.20 మిల్లీమీటర్ల వర్షం కురవగా, ఆదివారం నాడు 8.7 మి.మీ వర్షపాతం నమోదైంది.

## అకాల వర్షాలు కొంపముంచాయి

శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి దాకా జిల్లాలోని పలు మండలాల్లో అకాలవర్షాలు కురిశాయి. ఆరోజు సగటు వర్షపాతం 48 మిల్లీమీటర్లుగా నమోదైంది. ముఖ్యంగా నాయుడుపేట, సూళ్ళూరుపేట, దొరవారిసత్రం, పెళ్ళకూరు, కలువాయి, చేజర్ల, అనంతసాగరం, విడవలూరు, ఉదయగిరి, జలదంకి, అల్లూరు, కలిగిరి, వింజమూరు, వాకాడు మండలాల్లో వర్షం బాగా కురిసింది. ఆ తర్వాత శనివారం, ఆదివారం రోజుల్లో కూడా జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. దీంతో ఈ మండలాల్లోని అనేక గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ వ్యవసాయ సీజన్‌లో జిల్లాలో ఎక్కువగా రైతులు వరి పంటనే సాగుచేసుకుంటుండడంతో పొలాల్లో గత కొద్దిరోజులుగా ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ధాన్యం కోతలు కూడా జరుగుతున్నాయి. ఇప్పటికే ధాన్యం నూర్పిళ్ళు పూర్తయిన రైతులు ధాన్యాన్నంతా రోడ్లమీదనో, కల్లాల్లోనో పోసుకుని ఆరబెట్టుకుంటున్నారు. ఈ తరుణంలో ఒక్కసారిగా కుండపోత వానలు కురవడంతో రైతుల ఆశలపై నీళ్ళు కుమ్మరించినట్లయింది. ఈ వానలు తమ కొంప ముంచాయని రైతులు ఆవేదనలో మునిగిపోయారు.

కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఈ వానల నుంచి రక్షించుకుందామనుకుని వెంటనే గోతాలు, టార్పాలిన్ పట్టలు తెచ్చి ధాన్యం రాశులను కప్పేలోగానే వానకు అంతా తడసిముద్దయిపోయాయని అనేక ప్రాంతాల్లో రైతులు గోడుగోడుమంటున్నారు. ఈ తడిసిన ధాన్యం అమ్ముకోవాలంటే ఎంతో కష్టమని, ప్రభుత్వం ఈ దుస్థితిని గమనించి రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి, రైతులు నష్టాల పాలుకాకుండా ఆదుకోవాలని వారు కోరుకుంటున్నారు.

# పిల్లల్ని చదివించకండి... పాడైపోతారు!

పిల్లల్ని చదివించకండి. రెక్కలు ముక్కలు చేసుకుని...తినో, తినకో...నాలుగు రాళ్ళు వెనకేసి– పిల్లల్ని బాగా చదివించాలని కలలు కంటున్నారా? మంచి విద్యాబుద్ధులు నేర్పించాలని ఆరాటపడుతున్నారా? ఐఏఎస్‌లో... ఐపిఎస్‌లో అయితే చూసి సంతోషిద్దామని వేయి దేవుళ్ళకు మొక్కుకుంటున్నారా?

మీరసలు పిల్లల క్షేమం కోరిన వాళ్లేనా? బాగా చదివించి, మంచి విద్యాబుద్ధులు నేర్పించి– వాళ్ళను ఏం చేద్దామని!?

బాగా చదువుకొని, ముందు... ముందు వాళ్ళెందుకూ పనికి రాకుండాపోరా?

వద్దు. వద్దు. వాళ్ళ బంగారు భవిష్యత్‌ను చేజేతులా పాడుచేయవద్దు. చిన్నతనం నుంచే.. చక్కగా మంచి మంచి బూతులు నేర్పించండి. పెద్ద, చిన్న అనే తేడా లేకుండా అమ్మలక్కలు తిట్టడం నేర్పించండి. రోడ్లపై వెళ్ళేవాళ్ళమీద రాళ్ళు వేయడం నేర్పించండి. ఏ వయసుకు తగ్గ కొట్లాటలు ఆ వయస్సుల్లో నేర్పించండి. పిల్లలకు యుక్త వయసు వచ్చేసరికి, బూతులలో, దుర్భాషలాడడంలో, రాళ్ళు విసరడంలో, కొట్లాటల్లో, చొక్కా గుండీలు బొడ్డు వరకు పెట్టుకోకుండా... బోర విరుచుకు తిరగడంలో చక్కని ప్రావీణ్యం సంపాదిస్తారు. ఇక, అక్కడి నుంచి వారి దశ తిరిగినట్టే. లీడింగ్ పొలిటికల్ పార్టీల వాళ్ళు వెనకాల పడతారు. ప్రజాసేవలో కొత్త మెళకువలు నేర్పుతారు. పార్టీ పదవులు ఇస్తారు. పదవులకు టికెట్స్ ఇస్తారు. వరస కుదిరితే ఎమ్మెల్యేనో... మంత్రో అయిపోవచ్చు. కష్టపడి చదివినోళ్ళు.... చంకల్లో ఫైళ్ళు, చెవుల్లో పెన్సిళ్ళు పెట్టుకుని మీ పిల్లల ముందు చేతులు కట్టుకుని నిలబడతారు.






మీ పిల్లలు కొద్ది రోజుల్లోనే ప్రజాసేవలోనే పండిపోతారు. వళ్ళు బంగారం... ఇల్లు బంగారం... పళ్ళాలు బంగారం... గ్లాసులు బంగారం... బంగారంలో తడిచి ముద్దయి పోతారు. పొద్దుటి పూట సింగపూర్, సాయంకాలం హాంగ్ కాంగ్, రాత్రికి దుబాయ్. ఎటు కదిల్తే... అటు జనం. ఎటు చూస్తే ...అటు అధికార గణం, జీ హుజూర్ అంటూ. ఎటు తలతిప్పితే...అటు మహిళామణులు...హారతులు పట్టి, నుదుటన తిలకం దిద్దడానికి. ఏ గదిలో చూసినా...నోట్ల కట్టలు, గోతాములలో....

అదే, మీ పిల్లల్ని చదివించాలనుకున్నారే అనుకోండి. ఫీజులు కట్టడానికి ఇల్లూ, వాకిలీ కుదవబెట్టడమో, అమ్ముకోవడమో చేయాలి కదా! బండెడు పుస్తకాలు కొనాలి కదా! అవి మోస్తూ ఉంటే... విల్లంబులాగా వంగిపోయే వెన్నుపూసకు ఆపరేషన్ చేయించాలి కదా! చివరకు ఏ ఉద్యోగమో వస్తే...పైవాళ్ళ కింద... కుక్కిన పేనులా బతకాలి కదా! ఆ జీతం రాళ్ళు ఏ మూలకి? అందుకే, పిల్లల్ని చదివించకండి.

చదువుకుంటాం మొర్రో అంటూ మారాం చేసినా వినకండి. చింత బరిక తీసుకుని వళ్ళంతా చీరేయండి. అప్పటికీ దారిలోకి రాకపోతే, తెలుగు న్యూస్ చానెల్స్ రోజూ మూడు గంటలు చూపించండి. ఓ రెండు, మూడు దినపత్రికలు చదివి వినిపించండి. కొన్నాళ్ళకు దారిలో పడతారు. మీకు డౌట్ ఉంటే... బీహార్ వెళ్ళండి. ఒక్కొక్కరూ ఒక్కొక్క వజ్రం. బడికెళ్ళితే ఒట్టు. ఇప్పుడు చూడండి. మంత్రులవుదామా.., ముఖ్యమంత్రులవుదామా అంటూ తికమక అయిపోతున్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు తిరిగి చూడండి. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను చూడండి. ఎలా వెలిగిపోతున్నారో...! వీధి దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, దొమ్మీలు, కొట్లాటలు, రేపులు, ఎల్లుండులు(అంటే గ్రూప్ రేపులు అన్న మాట), మర్డర్‌లు చేసిన బుద్ధిమంతులు ఎంతమందో! ఇదివరకు... నాకు తెలిసినవాళ్ళ పిల్లాడు ఒకతను ఉండేవాడు. తండ్రి స్కూల్ టీచరు. పెద్దమనిషి. ఓ పాత డొక్కు సైకిలు వేసుకుని, రోడ్ పక్కనే తొక్కుకుంటూ స్కూల్‌కి వెళ్ళి వస్తుండేవాడు. ఈ కుర్రాడికి కాస్తంత చదువు చెప్పిస్తే, ఏ మాస్టారు ఉద్యోగమో చేసుకుంటూ... బతుకుతాడు కదా అని ఆయన ఆశపడుతూ ఉండేవాడు. ఈ పిల్లాడికేమో చదువు పేరు ఎత్తితే చాలు... వళ్ళంతా తేళ్ళు, జెర్రులు పాకుతున్నట్టు ఉండేది. ఒకసారి పక్కింటి సీత జడ గుంజాడు. వాళ్ళు తంతారేమోనని పారిపోయాడని ఆ మాస్టారు– పాపం ఒకసారి కళ్ళ నీళ్ళు కుక్కుకున్నాడు. 'ఏం భయపడొద్దు. ప్రయోజకుడై తిరిగి వస్తాడు' అని ధైర్యం చెప్పాను. ఒక రోజు, పేపర్‌లో ఫోటో పడింది. అదేదో పార్టీకి యూత్ వింగ్ సెక్రటరీ ఫలానా.... అని మొన్నీమధ్యే పోలీసులు అరెస్ట్ చేసి లోపలేస్తే, ఆ పార్టీ వాళ్ళే విడిపించి, పదవి ఇచ్చారని.

నేను అనుకున్నట్టే.. ప్రయోజకుడయ్యాడు. తరువాత వార్డు కౌన్సిలర్ అయ్యాడు. మునిసిపల్ ఛైర్మన్ అయ్యాడు. చివరికి మంత్రి కూడా అయ్యాడు. ఆ పిల్లాడు... తండ్రి మాట విని చదువుకొని ఉన్నట్లయితే, ఓ పంతులో అయ్యేవాడు. అవునా?

అవసరం అయితే.. పిల్లలను వీలైనంత రుబాబుగా.. బేవర్స్‌గా... జులాయిగా పెంచండి. వీలైతే.. పోకిరి సినిమా ఒకసారి చూడండి. పిల్లలకు చూపించండి. అయితే మంత్రి అన్నా అవుతాడు. లేదంటే – ముందు సినిమా యాక్టరై, తరవాత పార్టీ పెట్టి కోట్లు సంపాదిస్తాడు. నాదీ గ్యారెంటీ!

అయినా...మీ పిల్లల బంగారు భవిష్యత్‌కు మించిన లక్ష్యం మీకు మాత్రం ఏమి ఉంటుంది?

**– భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# ఇక..మునిసిపల్ ఎన్నికలకు రెడీ!

- ఏర్పాట్లకు సిద్ధమవుతున్న జిల్లా యంత్రాంగం



జిల్లాలో ఇటీవలే నాలుగు విడతల పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించిన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఇప్పుడు మునిసిపల్ ఎన్నికలపై దృష్టి పెట్టింది. జిల్లాలోని ఆత్మకూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో మార్చి 10వ తేదిన జరగనున్న ఎన్నికల ప్రక్రియకు సంబంధించి, అదేవిధంగా మార్చి 14న జరగనున్న కౌంటింగ్‌కు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆత్మకూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్ళూరుపేట పురపాలక సంఘాల్లో వరుసగా 23, 25, 25, 25 మొత్తం కలిపి 98 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు.

మునిసిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేష్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, డిజిపి గౌతం సవాంగ్ తదితర ఉన్నతాధికారులు ఈనెల 22న నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎన్నికల పరిశీలకులు బసంత్‌కుమార్, జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్, జేసీలు డా.ప్రభాకర్‌రెడ్డి, డా.హరేందిర ప్రసాద్, నెల్లూరు మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్, డిఆర్‌ఓ నాగేశ్వరరావు, ఆత్మకూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, వెంకటగిరి మునిసిపల్ కమిషనర్లు తదితర అధికారులు పాల్గొని జిల్లాలో జరగనున్న మునిసిపల్ ఎన్నికల ప్రక్రియను సమీక్షించారు. ఈ నాలుగు పురపాలక సంఘాల్లో ఇదివరకే నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందని, మొత్తం 531 మంది నామినేషన్లు సమర్పించారని కలెక్టర్ ఈ సందర్భంగా చెప్పారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది నియామకం వగైరాలన్నీ ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, మునిసిపల్ కమిషనర్లు తప్పనిసరిగా అన్ని పార్టీలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థులతో ఒకసారి సమావేశమై ఎన్నికల నియమావళిని అభ్యర్థులకు తెలియజేసి పాటించాల్సిన నిబంధనలు తెలియజెప్పాలన్నారు. ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలన్నారు. స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులతో సమన్వయంతో పనిచేసి మునిసిపల్ ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను అందరూ కచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికల పరిశీలకులు బసంత్‌కుమార్ మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో మునిసిపల్ ఎన్నికల ప్రక్రియలో కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎక్కువ శాతం ఓటింగ్ జరిగినప్పుడే ఎన్నికలు విజయవంతంగా జరిగినట్లని, ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్లను చైతన్యవంతం చేయాలని అధికారులకు సూచించారు.

# అందరి కృషి ఫలితమే.. ఈ అద్భుత విజయం

- సర్పంచ్‌లను అభినందించిన ఆదాల



పంచాయతీ ఎన్నికల్లో నేతలు, కార్యకర్తలు అందరూ ఎంతో కష్టపడి పనిచేశారని, వారందరి కృషి వల్లనే ఈ ఎన్నికల్లో వైకాపాకు అద్భుత విజయం లభించిందని నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈనెల 22న ఆయన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో కోవూరు నియోజకవర్గంలో గెలుపొందిన 59 మంది సర్పంచ్‌లను అభినందిస్తూ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని ఆ సర్పంచ్‌లందరినీ అభినందించారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో శాసనసభ ఎన్నికల్లో కంటే ఈ ఎన్నికల్లో అత్యధిక శాతం ఓట్లు వైయస్సార్‌కాంగ్రెస్ పార్టీకి లభించాయని, ఇది ప్రజాభిప్రాయానికి అద్దం పడుతోందని, ప్రజలు వైకాపాను మరింత ప్రోత్సహించారని, దీనివల్ల నేతల మీద మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, సురేష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణా వెంకయ్య, కోటేశ్వరరెడ్డి, హరి, అబూబకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు 'పిఎం కిసాన్' పురస్కారం

- ఢిల్లీలో అవార్డు అందుకున్న కలెక్టర్



ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (పిఎం కిసాన్) పథకం అమలుకు సంబంధించి జిల్లాలోని రైతుల సమస్యలను పరిష్కరించడంలో మన జిల్లాకు దేశంలోనే ప్రథమస్థానం లభించింది. ఎంతో విశిష్టమైన 'పిఎం కిసాన్' పురస్కారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాకు దక్కింది. ఢిల్లీలో ఈనెల24న నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయమంత్రి నరేంద్రసింగ్ తోమర్ చేతులమీదుగా జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఈ అవార్డునందుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి కైలాష్‌చౌదరి, రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ అరుణ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఆనందకుమారి, ఏ.డి అనిత తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటుచేసి సుమారు అయిదువేల మంది రైతుల సమస్యలను పరిష్కరించడంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చూపిన శ్రద్ధను కేంద్రం గమనించి జిల్లాకు ఈ అవార్డును ప్రకటించింది.



# అదరగొట్టిన అశ్విన్

- క్రికెట్‌లో సత్తా చాటిన నెల్లూరు పిల్లోడు
- 101 పరుగులు చేసి అజేయుడిగా నిలిచాడు

దేశవాళీ క్రికెట్‌లో నెల్లూరు పిల్లోడు సత్తా చాటాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఉన్న హోల్కర్ స్టేడియంలో జరుగుతున్న విజయహజారే ట్రోఫీలో ఆంధ్రా జట్టులో ఆడుతూ 84 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లు దంచేశాడు. 101 పరుగులు చేసి అజేయుడిగా(నాటౌట్) నిలిచి జట్టుకు విజయం సాధించిపెట్టాడు. నెల్లూరుకు చెందిన రాజ్‌గిరి, నళిని హెబ్బర్‌ల రెండవ కుమారుడు కె.అశ్విన్ హెబ్బర్. నాల్గవ తరగతి చదువుతున్నప్పుడే నెల్లూరులోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ వేసవి శిక్షణ శిబిరంలో చేరి క్రికెట్‌లో మెళకువలు నేర్చుకోవడం ప్రారంభించాడు. కోచ్‌లు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అనేక క్రికెట్ మ్యాచ్‌లలో పాల్గొని తన ప్రతిభను చాటుకున్నాడు. దేశంలోని పలు ప్రాంతాల్లో జరిగిన క్రికెట్ పోటీల్లోనూ రాణించి ఎన్నో విజయాలు సొంతం చేసుకున్నాడు. తాజాగా ఈనెల 22న ఇండోర్‌లో జరుగుతున్న విజయ హజారే ట్రోఫీలో తమిళనాడు–ఆంధ్ర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రజట్టులో ఉన్న అశ్విన్ హెబ్బర్ సెంచరీ చేసి నాటౌట్‌గా నిలవడమే కాక ఆంధ్ర జట్టుకు ఘనవిజయాన్ని చేకూర్చి అందరి కరతాళధ్వనులందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో తమిళనాడు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 41.3 ఓవర్లలో 176 పరుగులకే ఆలౌట్ అయిపోయింది. ఆంధ్రా జట్టు 31 ఓవర్లలోనే 3 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసి అద్భుత విజయం సాధించింది.






# చిరస్మరణీయుడు మా తాతయ్య

**– శీనయ్య మనవడు నల్లపరెడ్డి రాహిన్‌రెడ్డి**



తమ తాత స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మచ్చలేని రాజకీయ నాయకుడిగా ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం పొందాడని శీనయ్య మనవడు (రాజేంద్ర కుమారుడు) నల్లపరెడ్డి రాహిన్ అన్నాడు. ఫిబ్రవరి 23వ తేదీ నల్లపరెడ్డి శీనయ్య 28వ వర్ధంతి సందర్భంగా కోటలోని తమ తాత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించాడు. ఎక్కడా ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేకుండా, ప్రజా శ్రేయస్సే పరమావధిగా పనిచేశాడు కాబట్టే తమ తాత దివంగతులై 28 సంవత్సరాలైనా ప్రజలు ఇప్పటికీ ఆయనను ఆరాధిస్తున్నారని అన్నాడు. ఆయన వారసునిగా ఆయన ఆశయాలు కొనసాగిస్తామని చెప్పాడు. చాన్నాళ్ల తరువాత శీనయ్య మనవడు కోటలో సందడి చెయ్యడంతో, యువతరంలో ఉత్సాహం కనిపించింది. అంతా తాతలాగే మాట్లాడుతున్నాడని శీనయ్య అభిమానులు అనుకోవడం వినిపించింది.

వీక్షణం - మంజీర

# ఊరి తీర్పు

ఎన్నికల కమిషన్ నుంచి రోజుకో రకమైన ఆదేశాలు. ప్రభుత్వం న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కడం దిగడం, న్యాయమూర్తుల తీర్పులు... ఆంధ్రప్రదేశ్ పంచాయితీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో కొద్ది నెలల పాటు నడిచిన పంచాయితీ ఇదంతా. ఎట్టకేలకు.. కోర్టు తీర్పు వచ్చింది. సిఎం కోరుకున్న తీర్పు రాలేదని ఆనందపడినవాళ్లు ఉన్నారు. ఆ తీర్పు తమ నైతిక విజయమని తమ జబ్బలు తామే చరుచుకున్నవాళ్లు కూడా ఉన్నారు. అసలు పరీక్షకు రంగం సిద్ధమైంది. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామీణ ఓటరు ముందు పరీక్షకు కూర్చున్నాడు. సంతోషంలో ఉబ్బితబ్బిబ్బయ్యే ఫలితాలనిచ్చారు ఓటర్లు. ఇది ప్రజా తీర్పు. ప్రజాస్వామ్యంలో ఆ తీర్పు రాజముద్రతో సమానం. పైగా గ్రామీణ ఓటరు తీర్పు ఇది. అటు కొంచెం ఇటు కొంచెం ఊగిసలాట ఉండదు. తాము ఏది నిజమని నమ్ముతారో ఆ నమ్మకాన్ని బల్లగుద్ది చెప్పడానికి ఎటువంటి శషభిషలకూ పోరు గ్రామీణులు. అలా క్షేత్రస్థాయిలో ఫస్ట్ ర్యాంకుతో పాసయ్యారు సిఎం.

## అప్పుడు – ఇప్పుడు

దాదాపు రెండేళ్ల కిందట... 2019 మే నెలలో రాష్ట్ర ఓటర్లు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకున్నారు. అవి జనం జగన్‌ను గెలిపించిన ఎన్నికలు. ఇప్పుడు జరిగినవి... సిఎం జగన్ తన పాలనకు పరీక్ష పెట్టుకుని నెగ్గిన ఎన్నికలు. 'అప్పుడు గెలిపించింది జనం, ఇప్పుడు గెలిచింది జగన్'. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు కనిపించింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖం, 'ఒక్క అవకాశం ఇవ్వండి' అని ఆయన చేసిన విజ్ఞప్తి. ఇప్పుడు ఓటర్లకు కనిపించింది సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలన దక్షత. తామందుకుంటున్న పాలన ఫలాలు.

## తప్పుతున్న లెక్క

కోర్టు తీర్పునే తమ విజయంగా సంబరాలు చేసుకున్న ప్రధాన ప్రతిపక్షం... ప్రజాతీర్పు దగ్గరకు వచ్చేసరికి 'కుప్ప'కూలిపోయిందనడానికి దర్పణంగా కూడా నిలిచాయి ఈ ఎన్నికలు. అయినా ఎక్కడో లెక్క తేడా వస్తున్నట్లుంది. 'మా పార్టీ వాళ్లు ఇంత మంది గెలిచారు' అని ఒక లెక్క చెబుతోంది ప్రధాన ప్రతిపక్షం. ఈ వాక్యంలో లౌక్యం కూడా దాగి ఉంది. 'మా పార్టీ వాళ్లు' అంటున్నారు తప్ప 'ఈ ఎన్నికల్లో మా పార్టీ మద్దతుతో బరిలో నిలిచిన వాళ్లు' అని స్పష్టంగా అనడం లేదు. రాజకీయపార్టీలు – నాయకులు పార్టీలు మారడం మీద మీడియా ఎప్పుడూ 'కప్పల తక్కెడ రాజకీయాలు, కాకి లెక్కలు' అంటూ ఉంటుంది. ఆ మాట ఈ ఎన్నికల్లో మరింత చక్కగా ఇమిడిపోతోంది. ఒక వ్యక్తి అప్పుడెప్పుడో ఒక పార్టీలో ఉండి ఉండవచ్చు. ఆ తర్వాత ప్రాంతీయ, జాతీయ పార్టీలన్నీ చుట్టేసి ఉండవచ్చు. అన్ని నదుల పయనమూ సాగరంలోకే అన్నట్లు... ఇప్పుడు రాష్ట్రంలో కరెన్సీలో ఉన్న పార్టీలో స్థిరపడి ఉండవచ్చు. సదరు ట్రెండింగ్ పార్టీ బల పరిచిన అభ్యర్థిగా రంగంలో దిగి గెలిచినప్పటికీ ప్రతిపక్షం మాత్రం ఆ వ్యక్తిని తమ లెక్కలో కూడా చూపించుకుంటున్నట్లుంది. ఇది ఎలాంటిదంటే... ఒక క్రీడాకారుడు పతకం సాధించగానే... అతడికి అక్షరాలు దిద్దించిన కాలనీలోని చిన్న స్కూలు మొదలు అతడు గడప తొక్కిన విద్యాసంస్థలన్నీ 'తమవాడిగా' ప్రకటించుకుంటాయి. అతడు క్రీడాకారుడు కావడానికి ఆ స్కూలు చేసిందేమీ లేకపోయినప్పటికీ, తెల్లారేసరికి సదరు విద్యాసంస్థల ముందు కటౌట్‌లు, బ్యానర్‌లు వెలుస్తాయి. ప్రతిపక్షం లెక్క కూడా అలాగే ఉంది. 'మేము అధికారంలో ఉన్నప్పుడు అతడు మా వాడు' అని నేరుగా చెప్పుకోలేకపోతోంది. కానీ రాగాలాపన మాత్రం దాదాపుగా అదే పల్లవితో సాగుతోంది.

> **నీది ఏ పార్టీ!**
>
> **పంచాయితీ ఎన్నికలు కాబట్టి పార్టీల గుర్తులు లేవు. గ్రామాన్ని పార్టీల పరంగా చీల్చ కూడదని, రాజకీయ పార్టీల ప్రభావం గ్రామాల మీద ఉండకూడదని రాజ్యాంగం నిర్దేశించిన నియమం ఇది. ఈ నియమం నియమంగానే ఉంటోంది. కానీ గ్రామంలో ఒక అభ్యర్థి 'నేను సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నాను' అని ప్రకటించిన వెంటనే 'ఏ పార్టీ తరఫున' అని సాధారణ ప్రజలు అడుగుతున్నారు. అంటే 'గుర్తులు మాత్రమే లేవు, పార్టీలు ఉన్నాయి' అని తేటతెల్లమవుతోంది.**

## జనం – జగన్

ఈ ఎన్నికల్లో ఓటర్లు అభ్యర్థులను చూడలేదు. అతడు ఎన్ని పార్టీలు మారాడని చూడలేదు. మనం వేస్తున్న ఓటు జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞత వ్యక్తం చేయడమే అనుకున్నారు. కృతజ్ఞతగా ఉండడం తమ కర్తవ్యం అనుకున్నారు. మరి... ఒకటో తేది ఉదయమే వాలంటీర్‌లు పెన్షన్ డబ్బుతో ఇంటి ముందుకు వస్తున్నారు. 'అవ్వా! నీ పెన్షన్ డబ్బులు' అని చేతిలో డబ్బులు పెట్టి బయోమెట్రిక్ డివైజ్‌ను అవ్వ దగ్గరగా తెచ్చి, అవ్వ వేలిని తమ చేతిలోకి తీసుకుని వేలిముద్ర వేయించుకుంటున్నారు. జగన్ స్వయంగా అందరి ఇళ్లకు రాలేక వాలంటీర్లను తమ దగ్గరకు పంపించాడన్నంతగా సంతోషపడుతున్నారు పెద్దవాళ్లు. అలాగే ఎప్పుడూ తాళం వేసి కనిపించే గ్రామ పంచాయితీ ఆఫీసు ఇప్పుడు మనుషులతో కళకళలాడుతోంది. రైతు భరోసా కోసం ఆధార్‌తో అనుసంధానం చేయడానికి స్మార్ట్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ డివైజ్‌లన్నీ పరిపాలనలో 'కొత్త ఒరవడి' ప్రతిబింబిస్తున్నాయి. ఇలా జనం మనసులు గెలిచారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఈ ఎన్నికలు తేల్చిన లెక్కలు ఓట్ల లెక్కలు కావు, జగన్ గెలిచిన మనసుల లెక్కలు.



# Gunupati Harischandra Reddy

Chairman

GreenPark Hotels and Resorts Pvt Ltd

1933 ~ 2021

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com